ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం, మార్చి 28, 2026 | సంపుటి - 22 | సంచిక 180 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



# కమనీయం సీతారామ కల్యాణం

- మిథిలా మండపంలో కన్నుల పడువగా కళ్యాణోత్సవం
- పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన సీఎం దంపతులు
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వేడుకలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బట్టి, పలువురు మంత్రులు
- రామనామంతో మార్మోగిన భద్రాద్రి..
- భక్తులతో కిటకిట
- అన్ని ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం



*ఆకాశమంత పందిరి...!*
*భూదేవంత మండపం...!*
*వేదగోష పరిమళాలు...!*
*జయ జయ ద్వానాలు...!*
*ఇది..భద్రగిరినా...!?*
*దక్షిణఅయోధ్యపురినా...!?*
*భక్తుల సంభ్రమాశ్చర్యాలు...!*
*ఖచ్చితంగా 12 గంటలకు...!*
*సాంప్రదాయ అభిజిత్ లగ్నాన...!*
*రాములోరు సీతమ్మవారిని మాడారు...!*
*భద్రాచలంలో శుక్రవారం జరిగిన రాములోరి కళ్యాణం వైభోగమే...!*
*ముగ్ధ మనోహరమే...!*
*కనులారా తిలకించిన భక్తజన హృదయాలు ఉప్పొంగాయి...!*
*భద్రగిరి భక్తులతో పోటెత్తింది...!*

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మార్చి27(నినాదం):** భద్రాచలం దివ్య క్షేత్రంలో మిథిలా ప్రాంగణంలో శుక్రవారం జరిగిన సీతారాముల పరిణయ వేడుక ఆబాల గోపాలాన్ని మరిపించింది. ఆధ్యాంతం భక్తులను కనువిందు చేసింది. శుక్రవారం వేకువజామునే రామాలయంలో తొలుత అర్చక స్వాములు స్వామివారికి సుప్రభాత సేవ జరిపారు. అనంతరం నివేదన గావించారు. మూలవర్లకు అభిషేకం జరిపారు. తొలుత ఆలయంలో ఏకాంతంగా ధృవమూర్తుల కళ్యాణం నిర్వహించారు. తదుపరి ఉత్సవమూర్తులకు అలంకారం గావించారు. స్వామివారిని పల్లకిపై కూర్చుండబెట్టి వేదమంత్రాలు,బాజా భజంత్రీలు, కోలాట దృశ్యాలు నడుమ ఊరేగింపు నిర్వహించి స్వామివారిని మిథిలా ప్రాంగణం వద్దకు తీసుకువచ్చారు. శిల్పకళా శోభిత కళ్యాణ మండపంపై స్వామివారిని కూర్చుండబెట్టి అర్చక స్వాములు కళ్యాణ తంతును నిర్వహించారు.

▸▸తరువాయి2లో..

## ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

- 25న పార్టీ పేరును, జెండాను, ఎజెండాను ప్రకటిస్తా
- మేడ్చెల్ మునీరాబద్ వేదికగా పార్టీని వెల్లడిస్తా
- శ్రీరామనవమి రోజు కాబట్టి ప్రకటన చేస్తున్నా
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటన



**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10గంటలకు నూతన రాజకీయ పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లోని అధ్వయ కన్వెన్షన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పార్టీ ప్రకటన చేయబోతున్నట్లు చెప్పారు. అదే రోజు పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తామన్నారు. శ్రీరామనవమి మంచి రోజు కాబట్టి ఇవాళ ప్రకటన చేస్తున్నట్లు చెప్పారు.**

**నిజామాబాద్,మార్చి 27(నినాదం):** యువత, మహిళలకు మా పార్టీలో మంచి స్థానం ఉంటుంది. ఇన్నాళ్లూ మగవాళ్లు ఏర్పాటు చేసిన పార్టీలను చూశారు. తెలంగాణ ఆడబిడ్డగా నేను పార్టీ పెడితే ఎలా ఉంటుందో మీరే చూస్తారని అన్నారు. ఈ మేరకు నూతన రాజకీయ పార్టీపై గత కొంతకాలంగా వస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక ప్రకటన చేశారు. ఏప్రిల్ 25న ఉదయం 10 గంటలకు కొత్త పార్టీని స్థాపించనున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లోని మునీరాబాద్ వద్ద అద్వయ ఫంక్షన్ హాలులో జెండా ఆవిష్కరణ చేస్తామని ప్రకటించారు.

▸▸తరువాయి2లో..

## మూడ్రోజుల్లో ఈదురుగాలుల వర్షం

**తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక**

**హైదరాబాద్, నినాదం:** వేసవి భానుడి భగభగలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ కాస్త ఉపశమనం కలిగించే వార్తను అందించింది. గత కొన్ని రోజులుగా రికారు స్థాయి ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో రానున్న మూడు రోజుల పాటు వాతావరణం చల్లబడనుందని అంచనా వేసింది. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణపై ప్రస్తుతం ఉన్న వాతావరణ ద్రోణి ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

2

## పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి

- దీంతో ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయి
- పొలాలు, నీరు కలుషితం అవుతున్నాయి
- లోక్‌సభలో వరంగల్ ఎంపి కడియం కావ్య డిమాండ్



2

# పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గింపు

- పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై 10 తగ్గిస్తూ కేంద్రం ఆదేశం
- పశ్చిమాసియా యుద్ధంతో ఇంధన సరఫరాలో సమస్యలు
- సమస్యలను పర్యవేక్షించేందుకు రాజ్‌నాథ్ నేతృత్వంలో కమిటీ




***సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఎలాంటి భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను కేంద్రం తగ్గించింది. పెట్రోల్‌పై సుంకాన్ని లీటరుకు రూ.13 నుంచి రూ.3కు తగ్గించింది. లీటరుకు రూ.10గా ఉన్న డీజిల్ ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, మధ్యప్రాచ్య దేశాల మధ్య కొనసాగు తున్న యుద్ధంతో అంతర్జాతీయంగా చమురు సరఫరాకు అవాంతరాలు తలెత్తుతున్నాయి.***

**పశ్చిమాసియాలో యుద్ధంతో దేశంలో గ్యాస్, క్రూడ్ ఆయిల్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర కీలక నిర్ణయం తీసుకుంది. సమస్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర మంత్రులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇందులో సభ్యులుగా ఉంటారు. పెరిగిన దిగుమతి వ్యయాన్ని తట్టుకుని చమురు సంస్థల రికవరీకి తాజాగా కేంద్రం తీసుకున్న చర్య ఉపయోగపడుతుంది.**

**న్యూఢిల్లీ,మార్చి 27(నినాదం):** దేశవ్యాప్తంగా రిటైల్ ఔట్‌లెట్స్ యథాప్రకారం పనిచేస్తున్నాయని, అన్ని పంపుల్లోనూ తగినన్ని పెట్రోల్, డీజిల్ స్టాక్‌లు ఉన్నాయని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని వినియోగదారులను కోరింది. దేశంలో ఇంధన కొరతను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయెల్ ల ఎగుమతిపై సుంకాన్ని విధించింది. అయితే, వీటి ధరలను ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షిస్తామని తెలిపింది. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఛైర్మన్ వివేక్ చతుర్వేది ప్రకటన చేశారు. యుద్ధం కారణంగా ఇంధన సరఫరాలో అంతరాయం, ముడి చమురు ధరలు పెరుగుదలతో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నష్టాలను ఎదుర్కొంటున్నాయని వివేక్ చతుర్వేది పేర్కొన్నారు. వీటిని పూడ్చడానికే పెట్రోల్, డీజిల్‌లపై ఎక్సైజ్ డ్యూటీల్లో కోత విధించామన్నారు. వీటివల్ల వినియోగదారులకు నేరుగా ప్రయోజనం

▸▸తరువాయి2లో..

## సిఎం రేవంత్ సహా పలువురు స్టార్ కాంపెయినర్లు

**నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలకు..**

**న్యూఢిల్లీ,మార్చి 27(నినాదం):** నాలుగు రాష్ట్రల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారాన్ని విస్తృతం చేస్తోంది. మూడు రాష్ట్రాలకు సంబంధించి స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విడుదల చేశారు. ఒక్కో రాష్ట్రానికి 40 మంది చొప్పున నియమించారు. కేరళ, అస్సాం, పుదుచ్చేరితో పాటు గోవాలోని పోండా ఉప ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరించనున్నారు. మరోవైపు పుదుచ్చేరి స్టార్ క్యాంపెయినర్లుగా తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నియమితులయ్యారు.

## కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి

- మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలి
- సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్



2

**న్యూఢిల్లీ,మార్చి 27(నినాదం):** కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలని, ప్రధానంగా మహిళా జడ్జీల పదోన్నతిపై దృష్టి సారించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఈ మేరకు సిజెఐ గతవారం 25 హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు లేఖ రాశారని సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. న్యాయవ్యవస్థలో జడ్జీల ఖాళీల భర్తీ విషయాన్ని, ధర్మాసనాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాల్సిన అవసరముందని లేఖలో పేర్కొన్నారు.

## 30 బీహార్ సిఎంగా నితీశ్ రాజీనామా



**పాట్నా, నినాదం:** బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మార్చి 30న సీఎం పదవికి రాజీనామా చేయనున్నారు. అలాగే ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేసే అవకాశం ఉంది. ఈనెల 16న రాజ్యసభకు నితీశ్ ఎన్నికయ్యారు.

2

## పార్లమెంటరీ ప్యానల్ తీవ్ర ఆందోళన

### దేశీయ విమానయానరంగం భద్రత

# ఇరాన్‌పై దాడులు తీవ్రం

- జనావాసాలపై దాడిలో 26మంది మృతి
- ఇరాన్‌పై దాడులు నిలిపివేయాలి
- దౌత్యమార్గాలను కేంద్రం పరిశీలించాలి
- జమ్మూకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా

2



## భర్తను చంపి పూడ్చిపెట్టిన భార్య

- నాలుగు నెలల తరవాత బయటపడ్డ హత్య
- పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిన భార్య

2

## తెలంగాణలో సమృద్ధిగా పెట్రో నిల్వలు

### గణాంకాలు విడుదల చేసిన ప్రభుత్వం

**హైదరాబాద్,మార్చి 27(నినాదం):** తెలంగాణ రాష్ట్రంలో ఇంధన సరఫరాకు సంబంధించి ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేస్తూ ప్రభుత్వం తాజా నివేదికను విడుదల చేసింది. మార్చి 27నాటి అధికారిక గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు డిమాండ్ కంటే అత్యధికంగా అందుబాటులో ఉన్నాయని స్పష్టమైంది. సాధారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ అవసరమయ్యే ఇంధన పరిమాణం కంటే మార్చి 26వ తేదీన జరిగిన సరఫరా దాదాపు రెండింతలు ఎక్కువగా ఉండటం గమనార్హం. ఇది రవాణా రంగం, సామాన్య వినియోగదారులకు పెద్ద ఊరటనిచ్చే అంశం.

# కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ఎదుర్కోవాలి

- తాజా పరిస్థితులపై సిఎంలతో ప్రధాని మోడీ చర్చ
- పశ్చిమాసియాలో ఘర్షణలు, హార్మోజ్ జలసంధి మూసివేత భయాలపై చర్చ

2



## ఇక తెలంగాణ ఆడబిడ్డ పార్టీ

ఆ సమయంలోనే పార్టీ పేరును కూడా ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా సమయానికి చేరుకోవాలని, ప్రతి గ్రామం నుంచి తరలి రావాలని కవిత పిలుపునిచ్చారు. జయశంకర్ పేరు పెట్టుకుంటామని చెప్పారు. యువతకు, మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. ఆడబిడ్డల్లో మార్పు తేవడానికి ఒక ఆడబిడ్డగా ఈ పార్టీని పెడుతున్నానని తెలిపారు. బీసీ బిల్లు సాధించడం తమ వల్లనే సాధ్యమవుతుందని అన్నారు. బీసీలు, దళితులు, గిరిజనులు, మైనారిటీలు తరలిరావాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రాజకీయాలను శ్రీరాముడి స్ఫూర్తితో గమనించాలని కవిత అన్నారు. 'నేను నిజామాబాద్ బిడ్డను.. నిజామాబాద్ మట్టి మంచిది.. ఇక్కడ తీసుకునే ఏ నిర్ణయమైనా సక్సెస్ అయింది' అని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాలు సంపూర్ణంగా సాధించలేకపోయామన్నారు. రోజూ ప్రజల అవస్థలు చూస్తున్నామని కవిత వ్యాఖ్యానించారు. కచ్చితంగా ఒక కొత్త రాజకీయ పార్టీ రావాల్సిన అవసరం ఉందన్నారు. అందరూ మెచ్చేలా ఆ పార్టీ ఉండాలని అభిప్రాయపడ్డారు. సర్వోదయ తెలంగాణ రావాలని కవిత పేర్కొన్నారు. మేము ఎవ్వరికీ బీ పార్టీ కాము. మాది నంబర్ వన్ పార్టీ అవుతుంది. శ్రీరాముడి స్ఫూర్తితో, సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని పని చేస్తాం. ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. 95 శాతం తెలంగాణ ప్రాంతీయ పార్టీగా, ఇంటి పార్టీగా రాబోతోంది. ప్రజా సమస్యలపై వెంటపడి అడగాలి. ఎంపీ అర్వింద్ మతిమరుపు నాయకుడు. రైల్వే ఓవర్ బ్రిడ్జల జాప్యానికి నేనే కారణం అన్నారు. ఆయన వచ్చాక ఏం చేస్తున్నారు. అవసరమైతే ఢిల్లీలో లాబీ చేస్తా, గల్లీలో పని చేస్తా' అని కవిత స్పష్టం చేశారు.



## 30 బీహార్ సిఎంగా నితీశ్ రాజీనామా

రాజ్యాంగ ప్రకారం ఒక వ్యక్తి ఒకేసారి రెండు సభల్లో పదవులు నిర్వహించరాదు. ఒక పదవిని 14 రోజుల్లోపు వదులుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం బిహార్ శాసనసభ, శాసన మండలికి మార్చి 29 వరకూ విరామం ఇచ్చారు. తిరిగి ఉభయసభలు ఈనెల 30న సమావేశమవుతాయి. అదే రోజు నితీశ్ ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయనుండటం దాదాపు ఖరారైందని చెబుతున్నారు. మార్చి 16న బిహార్ నుంచి రాజ్యసభకు నితీశ్ ఎన్నికయ్యారు. మొత్తం 37 రాజ్యసభ స్థానాలకు ఖాళీ ఏర్పడగా, బిహార్, ఒడిశా, హర్యానాలోని 11 సీట్లకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. తక్కిన స్థానాలకు ఎన్నికలకు ముందే పోటీలేకుండా అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, జేడీయూ అధ్యక్ష పదవికి నితీశ్ కుమార్ ఈనెల 24న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నితీశ్ మినహా ఎవరూ ఈ పదవికి నామినేషన్ వేయలేదు. లోక్‌సభ ఎన్నికలకు ముందు 2023 డిసెంబర్‌లో జేడీయూ అధ్యక్ష పదవికి లలన్ సింగ్ రాజీనామా చేయడంతో అప్పటి నుంచి ఆ పదవిని నితీశ్ నిర్వహిస్తున్నారు. అయితే కేంద్రంలో ఆయనకు కీలక మంత్రి పదవి కట్టబెట్టే అవకాశం ఉంది. ఈ కారణంగానే అతను రాజీనామా చేశారని అంటున్నారు.

## పార్లమెంటరీ ప్యానెల్ తీవ్ర ఆందోళన

**న్యూఢిల్లీ, నినాదం:**

దేశంలోని పౌర విమానయాన రంగంలో భద్రతపై పార్లమెంటరీ ప్యానెల్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. 50 శాతం వాణిజ్య విమానాల్లో సాంకేతిక లోపాలు ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్ తాజాగా వెల్లడించింది. ఏడాదికాలంగా చేపట్టిన తనిఖీల్లో వాటిని గుర్తించామని, తరచూ అవే సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్నాయని పేర్కొన్నది. జనవరి 2025 నుంచి ఫిబ్రవరి 2026 వరకు 754 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా.. 377 విమానాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ఆడిట్ చేసిన వాటిలో ఇండిగో విమానాల సంఖ్యే ఎక్కువని.. లోపాలు కూడా వాటిలోనే అధికంగా ఉన్నాయని స్టాండింగ్ కమిటీ ఆన్ సివిల్ ఏవియేషన్ వెల్లడించింది. ఫిబ్రవరి మూడు వరకు 405 విమానాల్లో ఆడిట్ నిర్వహించగా.. 148 ఫ్లైట్ లో లోపాలు ఉన్నాయని పేర్కొన్నది. కొన్ని లోపాలు రిపీట్ అయ్యాయని తెలిపింది. 166 ఎయిరిండియా, 101 ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల్లో తనిఖీలు చేపట్టారు. వాటిల్లోనూ లోపాలు వెలుగు చూశాయి. దాదాపు సగం ఈ రెండు విమానయాన సంస్థలకు చెందిన వాటిల్లోనే ఉన్నాయి. ఈ స్థాయిలో లోపాలు వెలుగు చూడటంపై కమిటీ ఆందోళన వ్యక్తంచేసింది. ఇవి ప్రయాణికుల భద్రత, సంస్థల విశ్వసనీయతపై ప్రభావం చూపిస్తాయని హెచ్చరించింది. గత ఏడాది అహ్మదాబాద్ విమాన ప్రమాదం తర్వాత ఎయిరిండియాపై డీజీసీఏ నిర్వహించిన ఆడిట్‌ను కూడా నివేదిక ప్రస్తావించింది. ఆ ఆడిట్‌లో దాదాపు 100 భద్రతాలోపాలను గుర్తించారు. అందులో 7 ఉల్లంఘనలు లెవెల్`1కి సంబంధించినవని, వాటివల్ల తీవ్ర ముప్పు పొంచి ఉండటంతో వెంటనే వాటిని సరిచూసుకోవాలని ఎయిరిండియాకు డీజీసీఏ సూచించింది. విమానాల మోడళ్లను బట్టి శిక్షణ విషయంలో వ్యత్యాసాలు ఉండటాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ప్రస్తావించింది. 2025 చివరి నాటికి భద్రతా ఉల్లంఘనలకు సంబంధించి 19 నోటీసులను విమానయాన సంస్థలకు డీజీసీఏ జారీ చేసింది. వాటిలో 9 నోటీసులు ఎయిరిండియాకే వెళ్లాయని వెల్లడించింది.

## మూడ్రోజుల్లో ఈదురుగాలుల వర్షం

మరత్వాడా నుంచి కర్ణాటక తీరం వరకు సముద్ర మట్టానికి సుమారు 0.9 కిలో మీటర్ల ఎత్తులో ఏర్పడిన ఈ ద్రోణి కారణంగా రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు సంభవించాయి. దీని ఫలితంగా శుక్ర, శని, ఆదివారాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ముఖ్యంగా వర్షం కురిసే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు మెరుపులతో కూడిన జల్లులు పడతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అయితే.. ఈ ఉపశమనం తాత్కాలికమేనని, వచ్చే వారం నుంచి ఎండల తీవ్రత మళ్లీ పెరిగే అవకాశం ఉందని, సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు అధికం కావచ్చని అధికారులు వెల్లడించారు.

## పారాక్వాట్ గడ్డి మందును నిషేధించండి

న్యూఢిల్లీ : పారాక్వాట్ డైక్లోరైడ్ (గడ్డి మందు)పై పూర్తి నిషేధం విధించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య లోక్‌సభలో డిమాండ్ చేశారు. శుక్రవారం పార్లమెంట్ జీరో అవర్‌లో ఆమె ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ రసాయనం వల్ల పర్యావరణం , మానవ ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను వివరించారు. పారాక్వాట్ డైక్లోరైడ్ కేవలం కలుపు మొక్కలను నివారించే రసాయనం మాత్రమే కాదని, ఇది నేల, నీరు, గాలిని తీవ్రంగా కలుషితం చేస్తోందని ఎంపీ స్పష్టం చేశారు. వ్యవసాయ క్షేత్రాల్లో దీని మితిమీరిన వాడకం వల్ల భూసారం దెబ్బతినడమే కాకుండా.. భూగర్భ జలాలు కూడా విషతుల్యం అవుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరోక్షంగా ఆహారపు గొలుసులోకి చేరి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ గడ్డి మందు ఆత్మహత్యలకు ప్రధాన సాధనంగా మారడం అత్యంత కీలకమైన అంశం అని అన్నారు. చిన్నపాటి మనస్పర్థలు లేదా క్షణికావేశంలో ఈ రసాయనాన్ని సేవించిన వారు ప్రాణాలు కోల్పోతున్నారని ఆమె పేర్కొన్నారు. పారాక్వాట్ సేవించిన సందర్భాల్లో మరణాల రేటు దాదాపు 100 శాతం ఉండటం అత్యంత భయానకమైన విషయం. దీనికి ఇప్పటివరకు ఎటువంటి విరుగుడు అందుబాటులో లేకపోవడం వల్ల ఆసుపత్రికి చేరినా ప్రాణాలు కాపాడటం అసాధ్యంగా మారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ సహా తెలంగాణలోని అనేక జిల్లాల్లో పారాక్వాట్ వల్ల జరుగుతున్న ప్రాణ నష్టాన్ని ఎంపీ వివరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, పలువురు వైద్య నిపుణులు కూడా ఈ రసాయనం వల్ల కలిగే ముప్పును గుర్తించి, దీనిపై నిషేధం విధించాలని ఇప్పటికే గళమెత్తారు. ప్రజల ప్రాణాలను కాపాడటం కంటే వేరే ఏదీ ముఖ్యం కాదని, అందుకే కేంద్ర ప్రభుత్వం తక్షణమే దీని తయారీ, అమ్మకాలు , వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రమాదకరమైన ఇటువంటి రసాయనాలకు బదులుగా పర్యావరణహితమైన, సురక్షితమైన ప్రత్యామ్నాయాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని.. ఈ దిశగా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె కోరారు.

## పెట్రో ధరలపై ఎక్సైజ్ సుంకం తగ్గింపు

చేకూరనప్పటికీ.. చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఊరట లభించనుందన్నారు. ఈ చర్యల వల్ల వచ్చే పదిహేను రోజుల్లో రూ. ఏడు వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోతుందన్నారు. మరోవైపు, ఎగుమతులను అరికట్టడానికి డీజిల్, ఏటీఎఫ్‌లపై అదనపు సుంకాలను విధించామని సీబీఐటీ ఛైర్మన్ పేర్కొన్నారు. వీటి వల్ల వచ్చే పదిహేను రోజుల్లో ప్రభుత్వానికి రూ.1500 కోట్ల ఆదాయం వస్తుందన్నారు. దేశీయంగా డీజిల్, ఏటీఫ్‌లు అందుబాటులో ఉంచడానికే ఈ చర్యలు తీసుకున్నామన్నారు.

# కమనీయం సీతారామ కల్యాణం ..

**మొదటిపేజీ తరువాయి**

తొలుత తిరు కళ్యాణ సంకల్పం గావించారు. విశ్వక్సేన పూజ జరిపి, పుణ్యాహవాచనం గావించారు. 24 అంగుళాల పొడవు గల 12 దర్భలతో అల్లిన దర్భతాడును సీతమ్మ వారి నడుముకు బిగించారు. రామయ్య కుడి చేతికి సీతమ్మ వారి ఎడమ చేతికి రక్షా సూత్రాలు తొడిగారు. స్వామివారికి సువర్ణ యజ్ఞోపవీతాన్ని ధరింప చేశారు. అనంతరం కన్యాదానం చేశారు.

మధ్యాహ్నం 12 గంటలు సమీపించగానే అభిజిత్ లగ్నాన సీతారాముల వారి శిరస్సుపై జీలకర్ర బెల్లం ఉంచారు. జనకమహారాజు, దశరథ మహారాజు తరపున చేయించిన రెండు మంగళ సూత్రాలు శ్రీ భక్త రామదాసు వారు చేయించిన మరొక మంగళసూత్రంతో కలిపి మొత్తం మూడు సూత్రాలతో మాంగల్యధారణ గావించారు. తదుపరి తలంబ్రాల తంతు జరిపారు.

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణం సందర్భంగా భక్తులు శ్రీరామ జయరామ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా జయ జయ ద్వానాలు చేశారు. దేశ నలుమూలల నుంచి తరలివచ్చిన అశేష భక్తజనంతో భద్రాచలం పోటెత్తింది. రామాలయ పరిసరాలు కిక్కిరిశాయి. కళ్యాణం అనంతరం భక్తులు భద్రాచల రామున్ని బారులు తీరి మరి దర్శించుకున్నారు. భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. స్థానికులు భక్తులకు అన్నదానం, పులిహోర,మజ్జిగ, మంచినీళ్లు,పానకం అందజేసి తమ భక్తి భావాన్ని చాటారు

**పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సీఎం సమర్పణ**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సతీ సమేతంగా భద్రాచలంలో శుక్రవారం నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ప్రత్యేక హెలికాప్టర్లో భద్రాచలం తరలివచ్చిన సీఎం తొలుత శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో స్వామి వారిని కుటుంబ సభ్యులతో దర్శించు కున్నారు. అనంతరం ఆలయం వద్ద రూ.351 కోట్లతో చేపట్టిన ఆలయ అభివృద్ధి తొలిదశ పనులకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం మిధులా ప్రాంగణంకు చేరుకొని కళ్యాణాన్ని తిలకించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ, సీతక్క, ఎంపీ పోరిక బలరాం నాయక్, స్థానిక శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు, భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణ దొర, పలువురు న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, ఎండోమెంట్ కమీషనర్ హన్మంత రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, పీఓ బి. రాహుల్, అదనపు



కలెక్టర్లు విద్యా చందన, వేణుగోపాల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, భద్రాచలం రామాలయం ఈవో దామోదర్ రావు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ఎదుర్కోవాలి

**న్యూఢిల్లీ,మార్చి27(నినాదం):**

పశ్చిమాసియాలో ఘర్షణలు, హోర్ముజ్ జలసంధి మూసివేత భయాల కారణంగా అంతర్జాతీయ సంక్షోభం తలెత్తడంతో రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఇంధన సంక్షోభంపై చర్చించారు. పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ, ఎరువుల సరఫరాకు ఎదురవుతున్న సమస్యలు, రాష్ట్రాల సన్నద్ధతను సమీక్షించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రకటించిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు మినహా తక్కిన రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఈ వర్చువల్ సమావేశంలో పాల్గొన్నారు. దేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు, ఇంధన సరఫరా స్థిరంగా ఉండేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటోంది. అయితే క్షేత్రస్థాయిలో అమలు కోసం రాష్ట్రాల సహకారాన్ని ఇప్పటికే కోరింది. పశ్చిమాసియాలో పరిస్థితుల ప్రభావం అంతర్జాతీయంగా అన్ని దేశాలపై పడిందని, భారత్‌పైనా ప్రభావం ఉందని ప్రధాని మోదీ పార్లమెంటు ఉభయసభల్లోనూ ప్రకటించారు. కోవిడ్ మహమ్మారిని సమష్టిగా ఎదుర్కొన్నట్టే తాజా పరిస్థితులను కేంద్రం, రాష్ట్రాలు కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. నిత్యావసర వస్తువుల సరఫరాకు ఎలాంటి అవాంతరం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని రాష్ట్రాలను కోరారు. టీమిండియా స్పిరిట్‌తో పనిచేసి దేశానికి మారదర్శకంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రులతో మోదీ తాజాగా వర్చువల్ సమావేశంలో పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధానమంత్రి నిర్వహించిన వర్చువల్ మీట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణు దేవ్ సాయి, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, జేకే సీఎం ఒమర్ అబ్దుల్లా, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్, జార్ఖాండ్ సీఎం హేమంత్ సోరెన్, ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి, గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్ తదితరులు పాల్గొన్నారు.

## దేశంలో మరో అతిపెద్ద అంతర్జాతీయ విమానాశ్రయం

**నోయిడా జేవార్ లో అందుబాటులోకి**

**భారీ ఎయిర్‌పోర్టు**

**నేడు ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం**

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి**

**న్యూఢిల్లీ :**

దేశంలో మరో అతిపెద్ద అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ విమానాశ్రయం దేశ రాజధాని ప్రజలకు విమాన ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. ఈ ఎయిర్‌పోర్టును ప్రధాని మోదీ శనివారం ప్రారంభించనున్నారు. ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మాత్రమే ఉంది. ఒక్కోసారి కీలక సమయాల్లో ఒత్తిడిని తట్టుకోలేకపోతుంది. దీంతో ఎప్పటినుంచో మరో అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు నిర్మించాలని డిమాండ్ ఉంది. దీంతో కేంద్ర ప్రభుత్వం రూ.11,200 కోట్ల వ్యయంతో నోయిడాలోని జేవార్ ప్రాంతంలో రెండో అతిపెద్ద అంతర్జాతీయ విమానాశ్రయాన్ని నిర్మించింది. ఈ విమానాశ్రయాన్ని పబ్లిక్`ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో నిర్మించారు. 3,900 వి టర్ల పొడవైన రన్‌వే.. ఏటా 12 మిలియన్ల ప్రయాణికులు ప్రయాణం చేసేలా అత్యంత అద్భుతంగా నిర్మించారు. తాజాగా ఓపెనింగ్‌కు సిద్ధమైంది. నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశ ప్రారంభం కానుంది. ప్రధాని మోడీ చేతుల వి దుగా ప్రారంభం కానుంది. అనంతరం టెర్మినల్‌ను మోడీ పరిశీలించనున్నారు. ఇక ఈ ఎయిర్‌పోర్టు ప్రారంభం కాగానే ఢిల్లీ విమానాశ్రయంలో ప్రయాణీకుల రద్దీ తగ్గి.. విమానాల సామర్థ్యం పెరుగుతుంది. మొదటి దశలో విమానాశ్రయం సంవత్సరానికి 12 మిలియన్ల (2 కోట్ల) మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. తదుపరి దశలలో ఈ సామర్థ్యాన్ని 70 మిలియన్ల (7 కోట్ల) మంది ప్రయాణికులకు విస్తరింపజేస్తారు. ఆధునిక నావిగేషన్ వ్యవస్థలు, ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్, ఆధునిక లైటింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు.ఈ విమానాశ్రయం యమునా ఎక్స్‌ప్రెస్‌వే సవి పంలో ఉంది. మల్టీ`మోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్‌గా రూపొందించారు. ఇది రోడ్డు, రైలు, మెట్రో, ఇతర ప్రాంతీయ రవాణా మార్గాల ద్వారా అద్భుతమైన కనెక్టివిటీని అందిస్తుంది. విమానాశ్రయం డిజైన్, ఘాట్‌లు, భవనాలు భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. అన్ని వాతావరణ పరిస్థితుల్లో 24 గంటల విమాన సర్వీసులను అందించనుంది. నేటి నుంచి రెండో అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రానుందని కేంద్ర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన నోయిడా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రారంభించనున్నారని ఆయన వెల్లడించారు. ఈ విషయాన్ని తెలియజేస్తున్నందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్ ప్రజలందరికీ అభినందనలు తెలిపారు. 'రేపు జేవార్ వద్ద వి అందరినీ కలుస్తా' అంటూ రామ్మోహన్ నాయుడు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. దేశంలో విమాన ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోవడంతో ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల తాకిడి విపరీతంగా పెరిగింది. దీంతో ఈ ప్రాంతాల్లో మరో నూతన అంతర్జాతీయ ఎయిర్ పోర్టును నిర్మించాలని భావించింది. మేరకు ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం జేవార్‌లో నిర్మాణ పనులు చేపట్టి పూర్తి చేసింది. అత్యాధునిక టెక్నాలజీ, హంగులతో దీన్ని నిర్మించారు. మార్చి 28న జేవార్‌లో ప్రారంభోత్సవానికి తేదీ సైతం ఖరారు చేశారు. ఈ కొత్త విమానాశ్రయం దేశ విమానాశ్రయ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేస్తుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

## ఎల్‌బి స్టేడియంలో శాసనసభ్యుల క్రీడోత్సవాలు

**ఏర్పాట్లను పరిశీలించిన స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి**

**హైదరాబాద్, నినాదం:**

ఎల్బీ స్టేడియంలో ప్రారంభం కాబోతున్న శాసనసభ్యుల క్రీడోత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. 28 నుంచి ఎల్ బి స్టేడియంలో ప్రారంభం కానున్న ఫస్ట్ ఎడిషన్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026 ఏర్పాట్లను ఆయన స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని వర్గాల్లో క్రీడల పట్ల అవగాహన తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న శాసనసభ్యుల క్రీడోత్సవ పోటీలను ఘనంగా నిర్వహించబోతున్నామని, తద్వారా రాష్ట్రంలో క్రీడల పట్ల అవగాహన ఆసక్తి పెంచేందుకు ఈ కార్యక్రమాన్ని వినియోగించ బోతున్నామని తెలిపారు. దాదాపు 14 సంవత్సరాల తర్వాత తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహించబోతున్న ఈ క్రీడా పోటీలలో పార్టీల భేద భావాలు లేకుండా, అన్ని పక్షాల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు భాగస్వామ్యం కావడం సంతోషకరమని అన్నారు. ఈ ప్రారంభోత్సవ వేడుకల్లో టగ్ ఆఫ్ వార్, ఫుట్బాల్, క్రికెట్ , అథెటిక్స్, కబడ్డీ,వాలీబాల్ బాడ్మింటన్,టేబుల్ టెన్నిస్, తోపాటు కొన్ని రిక్రియేషనల్ క్రీడా పోటీలు నిర్వహించబోతున్నయని తెలిపారు. ఈ పోటీలు వీక్షించడానికి అందరికీ ఉచిత ప్రవేశం కల్పించబోతున్నామని, అందరికీ అవసరమైన సౌకర్యాలను సమకూర్చామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## భర్తను చంపి పూడ్చిపెట్టిన భార్య

అనంతపురం :

జిల్లాలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. కల్యాణదుర్గం మండలంలోని పాతచెరువు గ్రామంలో ఓ భార్య తన భర్తను హత్య చేసి అతని మృతదేహాన్ని ఇంటి ముందే పాతిపెట్టిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మృతుడు హనుమంతుగా గుర్తించగా, నిందితురాలు అతని భార్య సుకన్యగా పోలీసులు తెలిపారు. ఈ ఘటన నాలుగు నెలల క్రితమే జరిగినప్పటికీ, తాజాగా తల్లీకూతుళ్ల మధ్య జరిగిన గొడవ కారణంగా ఈ దారుణం బయటపడింది. కుటుంబ సభ్యుల మధ్య వివాదం పెరగడంతో విషయం వెలుగులోకి వచ్చి, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మ తదేహాన్ని బయటకు తీసి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా.. నిందితురాలు సుకన్య స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, భర్త హనుమంతుడు అనుమానంతో తరచూ వేధించేవాడని, అందుకే అర్ధరాత్రి సమయంలో రోకలిబండతో తలపై కొట్టి హత్య చేసినట్లు సుకన్య అంగీకరించినట్లు తెలుస్తోంది. పోలీసులు ఈ కేసులో పూర్తి వివరాలను తెలుసుకొనేందుకు విచారణ కొనసాగిస్తున్నారు. భర్త హనుమంతు గొర్రెలు కాసుకుంటూ జీవనం చేసేవాడని, వీరికి ఒక కొడుకు సందీప్, ఒక కూతురు అమృత సంతానం ఉన్నారని భార్య తెలిపింది. సుకన్యకు ఎవరితోనో అక్రమ సంబంధం ఉందని, అందువల్ల భార్యాభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవని సమాచారం. కొడుకు కూడా గొర్రెలు కాస్తుంటాడు. కూతురు కళ్యాణదుర్గం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నది. వీరి తండ్రిని చంపిన విషయం బయట ఎక్కడైనా చెబితే నిన్ను కూడా చంపుతానని సుకన్య తన కూతురును బెదిరించింది. అయితే ఈ అమ్మాయి తన తాతగారి ఊరు అనిమిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లడంతో, హత్య చేసిన విషయం అక్కడ చెబుతుందేమోనని నేడు కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్ కు వచ్చి సుకన్య నా భర్తను చంపి పూడ్చిపెట్టినానని చెప్పి పోలీస్ స్టేషన్ లో లొంగిపోయింది.

## కోర్టుల్లో ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయాలి

ముఖ్యంగా కోర్టుల్లో మహిళా జడ్జీల సంఖ్య తక్కువగా ఉందని అన్నారు. కొలీజియం సిఫారసులను ఆలస్యం చేయవద్దని, ఖాళీ కానున్నాయని తెలిసిన వెంటనే వాటిని భర్తీ చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆయన జడ్జీలకు సూచించారు. న్యాయరంగంలోని మరింత మంది మహిళలు వచ్చేలా న్యాయవ్యవస్థలో పెద్ద ఎత్తున సంస్థాగత మార్పులు చేపట్టాల్సి వుందని మార్చి8న అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. హైకోర్టు కొలీజియంలు జడ్జీల పదవుల భర్తీ కోసం ప్రతిభావంతులైన మహిళా జడ్జిలను మినహాయించకుండా, వారిని కేటాయించడం ఒక నిబంధనగా పరిగణించాలని అన్నారు. పదోన్నతి కోసం తమ పరిశీలన పరిధిని విస్తృతం చేయాలని, తమ రాష్ట్రాల్లోని, సుప్రీంకోర్టులో న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళా న్యాయవ్యాదులను కూడా చేర్చుకోవాలని హైకోర్టు జడ్జీలకు సూచించారు. ప్రస్తుతం వివిధ హైకోర్టుల్లో పలువురు మహిళలు ప్రధాన జడ్జీలుగా విధులు నిర్వహిస్తున్నారని, పంజాబ్, హర్యానా హైకోర్టులో 18మంది మహిళా జడ్జీలు ఉన్నారని పేర్కొన్నారు. మద్రాస్, ముంబయి హైకోర్టుల్లో కూడా సుమారు 12మంది మహిళా జడ్జీలు ఉన్నారని ఆయన తెలిపారు. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న న్యాయాధికారుల్లో మహిళలు సుమారు 36.3శాతం ఉన్నారని సిజెఐ పేర్కొన్నారు. ఇది ఒక సాధారణ గణాంకం కాదని, ఇది తరాల మార్పును ప్రతిబింబిస్తుందని అన్నారు. వ్యవస్థ పునాదిలోనే ఎక్కువ మహిళా భాగస్వామ్యం ఉన్నప్పుడు, అది అత్యున్నత న్యాయవ్యవస్థలో కూడా త్వరలోనే ప్రతిబింబిస్తుందని అన్నారు.

## ఇరాన్‌పై దాడులు తీవ్రం

**టెహ్రాన్,మార్చి 27(నినాదం):**

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా ఇరాన్‌లోని ఇస్ఫాహాన్‌లో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. నివాసాలపై దాడి చేయడంతో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌లోని ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కనీసం 26 మంది మరణించినట్లు ఫార్స్ న్యూస్ ఏజెన్సీ నివేదించింది. నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఈ దాడుల్లో ఏడుగురు మహిళలు, ఏడుగురు చిన్నారులు ఉన్నారని పేర్కొంది. గత నెల 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతమయ్యాడు. అనంతరం ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దాడులు చేసింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా గ్యాస్, చమురు కష్టాలు మొదలయ్యాయి. ఇక హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. అంతేకాకుండా ఇజ్రాయెల్, అమెరికా మిత్రదేశాలకు చెందిన ఆయిల్ ట్యాంకర్లను విడిచిపెట్టబోమని ఇరాన్ తేల్చి చెప్పింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## ఇరాన్‌పై దాడులు నిలిపివేయాలి

శ్రీనగర్ : ఇరాన్‌పై అమెరికా`ఇజ్రాయిల్ దాడులను జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు మహమ్మద్ యూసుఫ్ తరిగామి తీవ్రంగా ఖండించారు. ఈ సంఘర్షణను తక్షణమే నిలిపివేసి దౌత్య మార్గాల్లో పరిష్కారం కనుగొనాలని ఇద్దరూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అసెంబ్లీలో మాట్లాడిన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీతో పాటు ఇతరుల హత్యలను ప్రస్తావిస్తూ, యుద్ధ విధానాన్ని సమర్థించలేమని స్పష్టం చేశారు. పిల్లలు సహా పౌరుల ప్రాణనష్టం, యుద్ధ ప్రభావాలు అసహ్యకరమని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల వెనుక ప్రకటించిన లక్ష్యాలపై ప్రశ్నలు లేవనెత్తిన అబ్దుల్లా, యుద్ధ ప్రభావాలు జమ్మూ కాశ్మీర్‌లో కూడా కనిపిస్తున్నాయని తెలిపారు. ఇరాన్‌లో కొంతమంది భారతీయులు చిక్కుకుపోయారని, పెట్రోల్ పంపుల వద్ద పొడవైన క్యూలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను ప్రభావితం చేసే అంశాలపై చర్చించేందుకు అసెంబ్లీకి పూర్తి హక్కు ఉందని అన్నారు. ఇదే విషయంపై స్పందించిన మహమ్మద్ యూసుఫ్ తరిగామి, సంఘర్షణను ముగించడంలో కేంద్రం చురుకైన, నిర్మాణాత్మక పాత్ర పోషించాలని కోరారు. ఇరాన్‌తో భారతదేశానికి ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తుచేస్తూ, దేశవ్యాప్తంగా యుద్ధ వ్యతిరేక స్వరాలు వినిపించాలని సూచించారు. పరిస్థితిని శాంతింపజేయడానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణలో సమృద్ధిగా పెట్రో నిల్వలు

పెట్రోల్ వినియోగాన్ని పరిశీలిస్తే, రాష్ట్రంలో రోజువారీ సగటు సరఫరా 5,883 కిలో లీటర్లుగా ఉంటుంది. అయితే, మార్చి 26 నాటికి ఏకంగా 16,609 కిలో లీటర్ల పెట్రోల్‌ను సరఫరా చేశారు. అంటే సాధారణ డిమాండ్ కంటే 182 శాతం అధికంగా పెట్రోల్ అందుబాటులో ఉంది. అదేవిధంగా, రవాణా , వ్యవసాయ రంగాలకు అత్యంత కీలకమైన డీజిల్ సరఫరా కూడా ఆశాజనకంగా ఉంది. రోజువారీ సగటు అవసరం 7,348 కిలో లీటర్లు కాగా, ప్రభుత్వం ఏకంగా 19,580 కిలో లీటర్లను సరఫరా చేసింది. ఇది సాధారణ డిమాండ్ కంటే 167 శాతం ఎక్కువ. మొత్తంగా చూస్తే, రాష్ట్రవ్యాప్తంగా ఇంధన అవసరాలు తీర్చడానికి అవసరమైన సగటు 13,231 కిలో లీటర్లు అయితే, ప్రస్తుతం సరఫరా అవుతున్న పరిమాణం 36,189 కిలో లీటర్లుగా నమోదైంది. ఈ గణాంకాలను బట్టి చూస్తే రాష్ట్రంలో ఎక్కడా ఇంధన కొరత లేదని, సరఫరా వ్యవస్థ అత్యంత పటిష్టంగా ఉందని ప్రభుత్వం భరోసా ఇస్తోంది. ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని, ఇంధనం కోసం కంగారుపడి బంకుల వద్ద క్యూ కట్టాల్సిన అవసరం లేదని ఈ నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. 'తెలంగాణ రైజింగ' లక్ష్యంగా ఇంధన సరఫరాలో ఎక్కడా అంతరాయం కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.

## ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం



**ఖమ్మం, మార్చి 27(నినాదం):**
ఖమ్మం నగరంలో శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీ రామ నవమి సందర్భం గా టి ఎన్ జి ఓ ఎస్ ఫంక్షన్ హాల్ నందు శ్రీ సీతా రాముల కళ్యాణం మహోత్సవ వేడుక అత్యంత వైభవంగా భరత్ ఆచార్యుల బృందం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.సుమారు 7000 ల మంది భక్తుల కు మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుంటుపల్లి శ్రీనివాస్ రావు, చెరుకూరి రమేష్, ఏపూరి మధుసూదన్, కామ్రేడ్ వెంకటేశ్వర రావు,భవనాశి కేశవ రావు, పాపారావు, మురళి, సాదినేని శ్రీనివాస్, మిక్కిలినేని శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం

-రాష్ట్ర ఓబిసి కార్యదర్శి మాస్టర్ శెక్షావలి ఆచారి కాంగ్రెస్ కౌన్సిలర్లు



**గద్వాల ప్రతినిధి మార్చి 27 (నినాదం):**
జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో సీతారాముల కళ్యాణం మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయిజ మున్సిపాలిటీ కేంద్రంలోని మాల పేట 9వ వార్డు నందు శ్రీ శ్రీ శ్రీ గరుడ ఆంజనేయ స్వామి ఆలయంలో 10వార్డు దుర్గా నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో 11 వార్డు లో పెద్ద ఆంజనేయ స్వామి ఆలయంలో మరియు 19 వార్డు లో చింతల మునిస్వామి ఆలయం లో వీర బ్రహ్మంగారి ఆలయంలో 6 వార్డులో తుప్పత్రాల రామాలయం గుడి లో మరియు ఉప్పల క్యాంపులో సీతారాముల ఆలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాలను పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర ఓబిసి కార్యదర్శి శెక్షావల్లి ఆచారి మరియు 17వ వార్డు ఇంచార్జ్ మాల గాయత్రి , 18 వ వార్డు ఇంచార్జ్ శైలజ డాన్, 11వ వార్డు ఇంచార్జ్ బసవరాజ్ 14వ వార్డు ఇంచార్జ్ మేస్త్రి శీను,6 వార్డు ఇన్చార్జ్ కురువ లింగన్న,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాంబశివుడు, పాండురంగ, లక్ష్మన్న, ఫిరోజ్ ,షాలు, చాకలి మధు, నంద్యాల శీను,కొండ , డీజే మసుము,కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కురువ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 25న కొత్త పార్టీ పెడుతున్నా

**అదే రోజు పార్టీ పేరు ప్రకటిస్తాను**
**వచ్చే జడ్పీ ఎన్నికలలో స్వంతంగా పోటి చేస్తాం**
**తెలంగాణకు రాబోయేది సీఎం మహిళనే**
**కూతురిపై తండ్రిగా కేసీఆర్ ఆశీస్సులు ఉంటాయి**
**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకంట్ల కవిత**





**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 27 (నినాదం) :** తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ రావాలని బలంగా విశ్వసిస్తున్నామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకంట్ల కవిత అన్నారు. ఏప్రిల్ 25న తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభిస్తున్నట్లు అదే రోజు పార్టీ పేరును ప్రకటిస్తానని కవిత నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మీడియా సమావేశంలో వెల్లడించారు. తాను రాజకీయంగా ఎదిగింది ఆశీర్వదించింది నిజామాబాద్ జిల్లా నుంచే నని, అందుకే ఇక్కడి ప్రజల అశీస్సులతో కొత్త పార్టీ ప్రకటన ఆ శ్రీ రాముని అశీస్సులతో ప్రకటించినట్లు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రజా సంక్షేమ కార్యక్రమం చేయలేదని అన్నారు. రేవంత్ సర్కార్ పంటలు చేతికి వచ్చే సమయంలో రైతు బంధు విడుదల చేస్తే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎందుకు రోడ్డెక్కలేదని ప్రశ్నించారు. కేంద్రంలో బిజేపీ అధికారంలో ఉండి తెలంగాణలో ఎన్ని కొత్త పరిశ్రమలు, ఎన్ని నిధులు తెచ్చారని అన్నారు. మూసి ప్రాజెక్ట్ మీద ఎమ్మెల్సీగా తాను డిపిఆర్ లేదని తొలుత ప్రశ్నించింది తానేనని గుర్తు చేశారు. డిపిఆర్ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం డైరక్టుగా బ్యాంకుల అప్పుల కోసం వెలుతుంటే జాతీయ పార్టీలు ఐనా బిజేపి, బిఆర్ఎస్ ఎందుకు ప్రభుత్వ చర్యలను అడ్డుకోలేదని అన్నారు. అందుకే రాష్ట్రంలో ప్రత్యామ్నయ రాజకీయ పార్టీ ఏర్పాటు ఆవశ్యకత ఉందని అన్నారు. బిసిల రిజర్వేషన్ ల కోసం తెలంగాణ జాగృతి ఆందోళనతో దిగివచ్చిన కేంద్రం కుల గణన ప్రకటన చేసిందని గుర్తు చేశారు. తన నాయకత్వంలోనే అసెంబ్లిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు యూనైటేడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో ఆదోళన చేశానని అన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ల చట్టబద్ధత కుడా తన పోరాటాల ఫలం అని అన్నారు. రాష్ట్రంలో మహిళలు, యువత, ఎస్సీ, ఎస్టీ, బిసీల ఐక్యతతో కలిసి బావసారుప్యత కలిగిన వ్యక్తులతో 27 రోజుల పాటు చర్చలు, సమాలోచనలను జరిపి ఏప్రిల్ 25న ఉదయం 8 గంటలకు రాజకీయ పార్టీని మేడ్చల్ జిల్లా మొయినాబాద్ లో ప్రకటిస్తానని అన్నారు. ఇటీవల టెకుమట్ల బాధితుల కోసం ఆమరణ నిరాహార దీక్షకు బిసీఎస్సీఎస్టీ జేఏసీతో ఉద్యమం చేయగా ప్రభుత్వం దిగివచ్చి బాధితులకు ఇండ్లు కట్టించేందుకు ముందుకువచ్చిందని అన్నారు. త్వరలో పెట్టబోయే రాజకీయ పార్టీ ఎజెండా, అశయాలను, పార్టీ పేరును అదే రోజు ప్రకటిస్తానని తెలిపారు. తెలంగాణలో తాను పెట్టబోయే రాజకీయ పార్టీకి తండ్రిగా కేసిఆర్ ఆశీస్సులు తనపై ఉంటాయని అన్నారు. యువత రాజకీయలకు దూరంగా ఉండవద్దని కలిసి రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ జాగృతి కి గ్రామ గ్రామాన కార్యకర్తలు ఉన్నారని, రాబోయే రెండున్నర సంవత్సరాలలో కొత్త పార్టీని బలోపేతం చేస్తానని అన్నారు. ఇప్పటికి చాలా మంది లీడర్లు, ప్రజా ప్రతినిధులు తనతో టచ్ లో ఉన్నప్పటికి తనకు ప్రజా బలం ముఖ్యమని కాన్షీరాం ఆలోచన విధానం మేరకు పార్టీ ఏర్పాటు చేస్తున్నట్లు కల్వకుంట్ల కవిత అన్నారు. ఢిల్లీలో లాబీయింగ్ చేయగలను. గల్లీలో కష్టపడగలను నేను ఎంపీ అయినప్పుడు నిజామాబాద్- పెద్దపల్లి రైల్వే లైన్ పూర్తి చేస్తానని అంటే నవ్వారు. 25 ఏళ్లుగా జరగనిది ఇప్పుడు అవుతుందా అన్నారు. కానీ మూడేళ్లలో నేను ఆ పని చేసి చూపించా అని గుర్తు చేశారు.

## చికిత్స నిమిత్తం ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే

**ఆర్మూర్, మార్చి 27-( నినాదం) :** బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ఈరమణి నిర్మల వెన్నెముక సమస్యతో బాధపడుతుండడంతో ఆమెను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చికిత్స నిమిత్తం డబ్బులు అవసరం కాగా ఇట్టి విషయమై బాధిత కుటుంబ సభ్యులు స్థానిక నాయకులతో కలిసి నివాసముంటున్న ఆయన స్వగృహానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం రెండు లక్షల ఎల్.ఓ.సి.ని బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎల్..ఓ.సి. అందించి ఆదుకున్న బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి, సహకరించిన టిఆర్ఎస్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన ఈరమణి నిర్మల వెన్నెముక సమస్య తో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్ చికిత్స కోసం చేరడం జరిగింది. స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెన్నెముక సర్జరీ కోసం 2,00,000 ఎల్ ఓ సీ మంజూరు చేయించి శుక్రవారం హైదరాబాద్ లోని నివాసంలో వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## ఖిల్లా రామాలయంలో కళ్యాణ మహోత్సవం

**పాల్గొన్న ఎమ్మెల్యే ధన్ పాల్, మహేష్‌కుమార్ గౌడ్, కల్వకుంట్ల కవిత**



**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 27 (నినాదం):**శ్రీరామనవమిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని పురాతన ఖిల్లా రఘునాథ ఆలయంలో శ్రీరాముని కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోత్తంగా సీతారాముల కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, ఎమ్మెల్సీ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖిల్లా రామాలయ భూములను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని, రాజకీయాలు పక్కన పెట్టి మనందరం కలిసికట్టుగా ముందుకెళ్లాలని కోరారు. ఖిల్లా రామాలయ అభివృద్ధికి కేంద్ర పథకాలు అందేలా చూస్తానని, ఆలయ అభివృద్ధి కోసం తాను సంకల్పంతో ఉన్నానని, కేంద్ర సహకారం తీసుకొని 10 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రధానంగా ప్రసాద్ స్కీమ్ తో దేశంలోని అనేక ఆలయాలు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నాయన్నారు. రామాలయానికి రోప్ వే తెచ్చేందుకు కూడా తన వంతు ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. రామాయణంతో కుటుంబ విలువలు, గౌరవం, భక్తి ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. శ్రీ రాముడు ధర్మానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందన్నారు.

## నేరాల నియంత్రణకు నిఘా నేత్రాలే రక్షణ

**హుస్నాబాద్, మార్చి 27 (నినాదం):-**
ప్రజల రక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో కుచనపల్లి గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన 5 అత్యాధునిక సోలార్ ట్రై యాంగిల్ 4ఖ సి.సి. కెమెరాలను హుస్నాబాద్ ఏసీపీ సదానందం శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గ్రామంలో నేరాల నియంత్రణకు, భద్రతను పెంపొందించడానికి గ్రామస్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పోలీసులకు సహకరించడం అభినందనీయమన్నారు. ప్రతి గ్రామంలో సి.సి. కెమెరాల ఏర్పాటు వల్ల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయవచ్చని పేర్కొన్నారు. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగినప్పుడు నిందితులను త్వరగా పట్టుకోవడానికి ఈ నిఘా నేత్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మడప పద్మ హుస్నాబాద్ సీఐ శ్రీను, ఎస్ఐ లక్ష్మ రెడ్డి, వీపీఓ కుమార్, మరియు కుచనపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు



## శ్రీరామనవమి సందర్భంగా కట్ట మైసమ్మ తల్లి, పోతురాజులకు ప్రత్యేక పూజలు



**మధిర, మార్చి 27 (నినాదం):**
మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జంగా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సిమ్మర్స్ సభ్యులందరూ కలసి శ్రీరామనవమి సందర్భంగా అంబారుపేట చెరువు కట్టమీద ఉన్న కట్ట మైసమ్మ తల్లి, పోతురాజులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి అసోసియేషన్ గౌరవ సలహాదారు ఊటుకూరు భాస్కరరావు బాధ్యత తీసుకొని మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించి అందరికీ ప్రసాదం, పానకం అందరికీ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చుక్కా రాంబాబు, శీలం శ్రీనివాసరెడ్డి, చల్లా సత్యనారాయణ, కళ్యాణపు పూర్ణచంద్రరావు, జంగా శ్రీనివాస్ రెడ్డి, లింగంపల్లి అప్పారావు, పల్లబోతు ప్రసాదరావు, కస్తాల సతీష్, దుర్గాప్రసాద్, కొలగాని ప్రసాద్, ఉప్పెల సాంబశివారెడ్డి, మేకల ఉపేంద్ర, సముద్రాల ఉపేంద్ర, సుకూర్, ఇన్నెల్ రాము, వట్టి సైదులు, ఆదూరి అబ్రహం, వేముల నవీన్, కంచి పోగు ఆదాం, హనుమ కిరణ్, వనమా పూర్ణచంద్రరావు, కోలా ప్రసాద్, నీరుకొండ మురళి, బొడ్డుపల్లి రామకృష్ణ, ఫైర్ పిచ్చిరెడ్డి, గుర్రాల జనార్దన్ రెడ్డి, లక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బోడపాటి వెంకటేశ్వరరావు, రాజశేఖర్ రెడ్డి, లింగాల శ్రీనివాసరావు, అర్జున్, మణిదీప్, వేముల శ్రీను, పుల్లూరి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



## బోడెపుడి సేవా సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**మధిర, మార్చి 27 (నినాదం):**
బోడెపుడి వైద్య సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతినెల 4 వ శనివారం మధిర బోడెపుడి భవన్ నందు (సిపిఎం ఆఫీస్) నందు నిపుణులైన వైద్యుల సమక్షంలో 100/-రూ లకే బి. పి, షుగర్ కు సంబంధించిన మందులను నెలకు సరిపడా అందించబడును. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 7-00 గంటల నుండి 9-00 గంటల వరకు నిర్వహించబడుతుంది. కావున ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయగలరని కోరుచున్నాము. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు.9705192947, 9963663700, 9966393601, 7780166010,9490098095, 9948501325.

## వాడవాడలా భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు

**భక్తులు కనులారా తిలకించిన సీతారాముల కళ్యాణోత్సవ వేడుకలు**

**ఆర్మూర్, మార్చి 27 ( నినాదం):**
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గం లలో గ్రామ గ్రామాన, వాడ వాడలా, అన్ని కాలనీలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని శ్రీరామ ఆలయాలు, సీతారాముల ఆలయాలు, హనుమాన్ ఆలయాలలో భక్తుల జైశ్రీరామ్, జై హనుమాన్ నామ స్మరణలతో ఆలయాలు, గ్రామాలు మారుమోగాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకొని గ్రామ అభివృద్ధి కమిటీల, ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు ముందస్తుగానే ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల పంచాయతీ పాలకవర్గ సభ్యులు, కార్యదర్శులు, జి. పి.సిబ్బంది, భక్తుల సౌకర్యార్థం రోడ్లను శుభ్రపరచి, భక్తులకు ఆలయాలలో తాగునీటి సౌకర్యం కల్పించారు. శ్రీరామనవమి పురస్కరించుకొని అని కుటుంబాల సభ్యులు, దీక్షాపరులు, వేకువ జామున లేచి పుణ్య స్నాన ఆచరించి, ఇంటి ముందు కల్లాపి, రంగురంగుల ముగ్గులు వేసి, మామిడి తోరణాలు ధరింపజేసి, నూతన వస్త్రాలు ధరించి సకుటుంబ సపరివారంగా ఆలయాలకు వెళ్లి ప్రదక్షిణలు జరిపి, ఆలయంలో వేద పండితులచే యజ్ఞోమంలో పాల్గొని, సీతారాముల కల్యాణ వేడుకలను కనులారా తిలకించారు. సీతారాముల కల్యాణోత్సవ అనంతరం భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి, తీర్థప్రసాదాలు తీసుకొని, భక్తుల కోసం అన్నదానం లో భక్తులు పాల్గొని అన్నదాన కార్యక్రమంలో భుజించారు. స్థానిక గ్రామ ప్రజా ప్రతినిధులు, ఇన్చార్జి పార్టీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు, దీక్ష పరులు ఆలయంలో సీతారాములను దర్శించుకుని, భక్తులకు సేవా కార్యక్రమాలు అందజేశారు. శ్రీరామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించి జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో ముందుగా సీతారాముల చిత్రపటాలను ట్రాక్టర్లలో పేర్చి, భజనాలు చేస్తూ, కీర్తనల తో, దీక్షాపరులు, భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని రథోత్సవాలను నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా భక్తుల మధ్య రథోత్సవాలు ఘనంగా నిర్వహించారు.



## శ్రీరామ పట్టాభిషేకం వైభవంగా నిర్వహించాలి

**- కలెక్టర్ అంకిత్**

**కొత్తగూడెం, మార్చి27(నినాదం):**
భద్రాచలంలో శనివారం నిర్వహించనున్న శ్రీరామ పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా, అత్యంత ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శ్రీరామ పట్టాభిషేక కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా హాజరు కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లను పక్కా ప్రణాళికతో, ఎటువంటి లోపాలకు తావు లేకుండా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సారపాకలో హెలిప్యాడ్ వద్ద గవర్నర్ స్వాగత ఏర్పాట్లు నుండి ప్రారంభించి, ఐటీసీ గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి, అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దర్శనం, తదుపరి మిథిలా స్టేడియం లో మహా పట్టాభిషేక కార్యక్రమం, గిరి మార్ట్ ప్రారంభోత్సవం, తిరిగి ఐటీసీ గెస్ట్ హౌస్‌లో భోజన ఏర్పాట్లు వంటి అన్ని కార్యక్రమాలు సమన్వయంతో నిర్వహించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమ ప్రదేశాల వద్ద పారిశుధ్యం, తాగునీరు, వైద్య సేవలు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ నియంత్రణ వంటి అన్ని మౌలిక సదుపాయాలను సమృద్ధిగా కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని వీక్షించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం విజయవంతం కావడానికి ప్రతి అధికారి తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ అంకిత్ తెలిపారు.



## ఘనంగా ప్రకృతి మధ్యలో సీతారామస్వామి కళ్యాణ మహోత్సవం

**హుజూరాబాద్, మార్చి 27(నినాదం):** పాటిమీద ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ సీతారామస్వామి కళ్యాణ మహోత్సవం వైభవంగా పాటి మీద ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ సీతారామస్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. ఈ పవిత్ర వేడుక భక్తుల కన్నుల పండుగగా నిలిచింది. ఆలయ అర్చకులు తిరుమలయ్య, ప్రదీప్ వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ మహోత్సవం ఆలయ చైర్మన్ గందె శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.భక్తుల సమక్షంలో జరిగిన ఈ కళ్యాణ మహోత్సవాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు భక్తిశ్రద్ధలతో వీక్షించారు. దేవాలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడగా, స్వామివారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.ఇక ఈ దేవాలయం దినదినాభివృద్ధి చెందుతూ భక్తుల ఆదరణను మరింతగా పొందుతోంది. రంగనాయకుల గుట్ట వద్ద ప్రకృతి మధ్యలో నెలకొన్న ఈ ఆలయం ప్రశాంత వాతావరణంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఇక్కడికి రావడం ఎంతో ఆనందంగా, ఆహ్లాదకరంగా ఉందని భక్తులు అభిప్రాయ పడుతున్నారు. ఈ సందర్భంగా ఎస్వీఆర్ స్కూల్ అధినేత జగన్ భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించి కార్యక్రమాన్ని భక్తి, ఆనందోత్సాహాల మధ్య కొనసాగించారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ సుహాసిని ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ గందె రాధికతో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## ఘనంగా రాములోరి వివాహం

**-టిటిడి కార్యాలయం ముందు వివాహ వేడుకలు**

**-భక్తిశ్రద్ధలతో కళ్యాణానికి హాజరైన భక్తులు**



**ఖమ్మం ప్రతినిధి మార్చి 27:(నినాదం):**
సీతారామచంద్ర వారి కళ్యాణ మహోత్సవాన్ని స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం సీతారామచంద్ర కళ్యాణమండలి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇటీవల నూతనంగా ఏర్పడిన కమిటీ ఈ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించి ఈ ఏడాది మొట్టమొదటిసారిగా నిర్వహించారు. కళ్యాణ వేడుక కమిటీ సభ్యులు మందడపు శంకర్ రెడ్డి, టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కోఆర్డినేటర్ కర్నాటి రామకృష్ణారెడ్డి, బోయినపల్లి కోటిరెడ్డి, కొండేటి గోపి ఉప్పల సత్యనారాయణ రెడ్డి పప్పరాజు అచ్యుత రామారావులు కార్యాలయం ముందు కళ్యాణ వేదికను అట్టహాసంగా ఏర్పాటు చేశారు. పెళ్లి పీటలపై కూర్చునే భక్తులు శ్రీ సీతారాములు, లక్ష్మణుడు ఆంజనేయస్వామి విగ్రహాలను టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయం నుండి వేద మంత్రోచ్చారణల మధ్య, మేళతాళాలతో వివాహ వేడుక వేదిక వద్దకు తోడుకొని వెళ్లారు. అక్కడ శ్రీ సీత రాముల వారి కళ్యాణాన్ని నిర్వహించారు. అయ్యవారు వేదమంత్రోచ్చారణల మధ్య గణేష్ పూజలు, కలశపూజ, జిలకర బెల్లం పెట్టి, మంగళ ధారణ నిర్వహించారు. ప్రవచనకర్త వనం తేజశ్రీ ప్రవచనం చేశారు. అనంతరం భక్తులకు స్వామి వారి ప్రసాద్ ప్రసాదాన్ని అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కళ్యాణ వేడుకను కనులారా తిలకించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు నిర్వహించిన వివాహ వేడుకలో అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు కళ్యాణ వేడుకను తిలకించి పులకించిపోయారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి, వేమిశెట్టి వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు తదితర భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని సేవలు అందించారు.

## గ్రామానికి 10 ఏళ్లుగా ప్రజల దాహార్తి తీరుస్తున్న వాటర్ ప్లాంట్

**మధిర, మార్చి 27 (నినాదం):**
మధిర మండలం ఇల్లెందుల పాడు మరియు పరిసర గ్రామాలకు గత పది సంవత్సరాల నుంచి నిర్విరామంగా చావా రవి ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ తన సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తుంది. కొన్ని సంవత్సరాల క్రితం మంచి నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని తన సొంత ఖర్చులతో ఇల్లందు లపాడు గ్రామంలో వాటర్ ప్లాంట్ నెలకొల్పి గ్రామ ప్రజలకు, పరిసర ప్రాంత ప్రజలకు ఉచితంగా నీటిని సప్లై చేస్తున్నందుకు ప్రజలు చావారవి కి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



### కామ్రేడ్ తమ్మినేని వీరభద్రంను
## కలసిన డివిజన్ నాయకులు



**మధిర, మార్చి 27 (నినాదం):**
సిపిఎం తెలంగాణ మాజీ రాష్ట్ర కార్యదర్శి కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ తమ్మినేని వీరభద్రం ను కలిసిన సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి, మడుపల్లి గోపాలరావు, చింతలచెరువు కోటేశ్వరరావు, మరియు శీలం నరసింహారావు, మంద సైదులు, దొండపాటి నాగేశ్వరరావు, బట్టు పురుషోత్తం, కిలారి సురేష్, బంధం శ్రీనివాసరావు, ముదిగొండ సర్పంచ్ కట్టకూరు ఉపేందర్ రావు, వేల్పుల భద్రయ్య, కందికొండ శ్రీనివాసరావు, మందడపు వెంకన్న, సతీష్ తదితరులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు పార్టీ ద్వారా సేవలందించిన కామ్రేడ్ తమ్మినేని వీరభద్రం పూర్తి ఆరోగ్యంతో కోల్కొని రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు.








# వంద కాలనీల సమాహారం.. విద్యలో వెనకబాటు తనం

జనాభా మూడు లక్షలు..
రెండే ప్రభుత్వ హైస్కూల్స్
కొండంత జాగ ఉన్నా..
కళాశాలలు నిండు సున్నా
యువతకు విద్యను అందించండి..
ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ



**జవహర్‌నగర్, మార్చి 27(నినాదం):** తెలంగాణలోని పూర్వ అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ గా, జనాభాపరంగా దాదాపుగా మూడు లక్షల జనాభా, మినీ భారతి గా భారతదేశంలోని వివిధ ప్రాంతాల జనాభా, కొండంత ప్రభుత్వ జాగ ఉన్న కళాశాలలు, పాఠశాలలు నిండు సున్నాగా తయారయ్యాయని జవహర్ నగర్ ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ సభ్యులు తమ గోడును వెల్లబోసుకున్నారు. ముఖ్యంగా జవహర్ నగర్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని అతిపెద్ద పూర్వ మున్సిపల్ కార్పొరేషన్ గా గణితకెక్కిందని జవహర్ నగర్ పరిధిలో విద్యాలయాలు లేక యువత పెడదారిన పట్టే ప్రమాదం ఉందని, ప్రభుత్వ పాఠశాల సాధన కమిటీ పేర్కొంది. జవహర్ నగర్ మొత్తానికి కేవలం రెండు ప్రభుత్వ హై స్కూల్స్, ఎనిమిది ప్రాథమిక పాఠశాలలు మాత్రమే ఉండగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేక విద్యార్థులు 10 కిలోమీటర్ల దూరం వెళ్లి చదువుకుంటున్నారు. జవహర్ నగర్ లో కాలేజీ లేకపోవడం వల్ల వేలాది మంది పిల్లలు మధ్యలోనే విద్యను విడిచి పెట్టే పరిస్థితి నెలకొందని ఈ పరిస్థితులు బాల కార్మిక వ్యవస్థకు బాల్యవివాహాలు దాడులు మత్తు పదార్థాల ప్రభావం వంటి సమస్యలకు దారితీస్తాయని పేర్కొన్నారు. విద్యకు నిరంతర ప్రాముఖ్యత లేకపోవడం వల్ల పిల్లల భవిష్యత్తును మాత్రమే కాకుండా మొత్తం సమాజ అభివృద్ధి కూడా పుట్టుపడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో నర్సరీ నుండి 12వ తరగతి వరకు సమగ్ర విద్యను అందించే తెలంగాణ పబ్లిక్ స్కూల్ (ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్) స్థాపన జవహర్ నగర్ ప్రాంతానికి అత్యవసరంగా మంజూరు చేయవలసిందిగా ప్రభుత్వ సాధన కమిటీ డిమాండ్ చేస్తుంది. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ స్థాపిస్తే ఒకే ప్రాంగణంలో ప్రాథమిక విద్య నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందించడం వల్ల విద్యార్థుల డ్రాప్ ట్రేడ్ గణనీయంగా తగ్గి పిల్లలకు సురక్షితమైన స్థిరమైన విద్యా వాతావరణంలో నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి అన్నారు. ముఖ్యంగా బస్తీల పిల్లలకు ఇది సమాన అవకాశాలు కల్పించే దిశగా కీలక ముందడుగు పడుతుందని తెలిపారు. ఈ అవసరాన్ని గుర్తించిన గబ్బిలాల పేట, రాజీవ్ గాంధీ నగర్, శాంతినగర్, గిరిప్రసాద్నగర్, నందమూరి నగర్, బస్తీల నివాసులు బస్తీ పెద్దల సమక్షంలో సమావేశమై ఫ్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యను లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వ పాఠశాల సాధనా కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కమిటీ సమగ్ర పాఠశాల స్థాపన కోసం ప్రభుత్వంతో నిరంతరం చర్చలు జరుపుతుందని అవసరమైన భూమి మౌలిక సదుపాయాలు అనుమతుల కోసం కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కమిటీలు కన్వీనర్ గా మోతే రాజేశ్వరి కో- కన్వీనర్లుగా నాగమణి, సూర వెంకటయ్యను నియమించారు. యూత్ కన్వీనర్ గా పి. గణేష్ సలహాదారులుగా ఆవుల దుర్గేష్ ,అనసూర్య, శకుంతల, జహంగీర్, జయసుధ, మబ్బు అంజయ్య, గోవాడ మనీ, సభ్యులుగా పి. స్వరూప, బాలలక్ష్మి, స్వప్న, మాధవి, మౌనికను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సమాజం యొక్క ఈ సమిష్టి ప్రయత్నం వల్ల జవహర్ నగర్ ప్రాంతంలో విద్యాహక్కు సాధనలో ఒక ముఖ్యమైన ముందడుగు పడుతుందని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకొని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ స్కూల్ ని ఆమోదించి తద్వారా స్కూల్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కమిటీ సభ్యులు బస్తీ వాసులు విజ్ఞప్తి చేశారు. పిల్లల భవిష్యత్తు కోసం సమాజ అభివృద్ధి కోసం ఇది అత్యవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

# భారీ సైబర్ మోసం బహిర్గతం చేసిన పోలీస్‌లు

మ్యూల్ బ్యాంక్ ఖాతాల ద్వారా రూ.138 కోట్ల
అక్రమ లావాదేవీలు గుర్తింపు,
బ్యాంకు మేనేజర్ సహా, 13మంది అరెస్ట్
పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం




**కరీంనగర్, మార్చి 27(నినాదం) :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక చర్యల్లో భాగంగా సైబర్ నేరాలకు సహకరిస్తున్న పెద్ద నెట్‌వర్క్‌ను పోలీసులు బట్టబయలు చేశారు. ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0 లో భాగంగా మొత్తం 24 మంది నిందితులను గుర్తించి, అందులో 13 మందిని శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ నెట్‌వర్క్ 'మ్యూల్ బ్యాంక్ ఖాతాలు' ద్వారా సైబర్ మోసాలకు వేదికగా పనిచేస్తూ, సుమారు రూ.138 కోట్ల మేర అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. రత్నాకర్ బ్యాంక్ లిమిటెడ్, ఇతర వర్చువల్ ఖాతాల ద్వారా ఈ మోసాలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు సమన్వయకం ్తలు, మధ్యవర్తులు, ఖాతాదారులుగా విభజించి పద్ధతిగా నేరాలను నిర్వహించారు. సామాన్య ప్రజలను డబ్బు ఆశ చూపించి వారి పేర్లపై ఖాతాలు తెరిపించి, వాటిని సైబర్ నేరగాళ్లకు అప్పగించే విధంగా వ్యవహరించారు. ఈ ఖాతాల ద్వారా మోసపూరిత డబ్బును విదేశాలకు మళ్లించినట్లు సమాచారం.
ఈ కేసులో భారత న్యాయ సంహిత సెక్షన్ 112, 318(4)తో పాటు సమాచార సాంకేతిక చట్టం సెక్షన్ 66-డి కింద కేసులు నమోదు చేశారు. అరెస్ట్ అయిన వారిలో రత్నాకర్ బ్యాంక్ మేనేజర్ భువనగిరి కళ్యాణ్, క్యాషియర్ అయేషా బేగం కూడా ఉన్నారు. అయేషా బేగం గర్భిణి కావడంతో ఆమెను మీడియా ముందు హాజరుపరచలేదు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, వర్చువల్ ఖాతాల ద్వారా సుమారు రూ. 12.25 కోట్లు, రత్నాకర్ బ్యాంక్ ఖాతాల ద్వారా రూ. 125.80 కోట్లు లావాదేవీలు జరిగాయి. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ప్రజలకు హెచ్చరిక జారీ చేస్తూ, స్వల్ప లాభాల ఆశతో తమ బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డులు లేదా లాగిన్ వివరాలు ఇతరులకు ఇవ్వవద్దని సూచించారు. తెలియని వ్యక్తుల పేర్లపై ఖాతాలు తెరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా అధికారిక వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. తదుపరి దర్యాప్తులో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఏసిపి వెంకటస్వామి, వన్ టౌన్ సీఐ రాంచందర్, టూ టౌన్ సీఐ సృజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రాన్ని ప్రారంభించిన బీజేపీ సీనియర్ నాయకులు కొత్తపల్లి ఉపేందర్ రెడ్డి





**మల్కాజిగిరి, మార్చి 27 (నినాదం) :** నేరేడ్‌మెట్ డివిజన్‌లోని నేరేడ్‌మెట్ బస్ స్టాప్ వద్ద భాగవాన్ శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీజేపీ సీనియర్ నాయకులు కోతపల్లి ఉపేందర్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇక్కడ చలివేంద్రం ఏర్పాటు చేసి ఎండా కాలం ప్రజలకు దాహార్తి ని తీరుస్తూ, సేవలు చేయడం చాలా గొప్ప విషయ మన్నారు. నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో నేరేడ్ మెట్ డివిజన్ అధ్యక్షులు ఆదిత్య, శర్మ, పరాస్ జైన్, శ్యామ్, ట్రస్ట్ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే లక్ష్యం.. సమస్యల పరిష్కారమే సంకల్పం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
'11కేవీ వైర్ల భయం' కి వీడ్కోలు
30 ఏళ్ల సమస్యకు చెక్





ధర్మపురి మార్చి 27( నినాదం ): ఏళ్ల తరబడి ప్రాణాలపై ముప్పుగా నిలిచిన విద్యుత్ సమస్యకు చివరకు శాశ్వత పరిష్కారం లభించింది. ధర్మపురి పట్టణంలో ని నాగారం, కమలాపూర్ గ్రామాలకు వెళ్లే రహదారికి ప్రక్కన గల ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను పూర్తిగా తొలగించి, కొత్తగా ఏర్పాటు చేసిన లైన్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు.

**సమస్యలపై అవగాహన... పరిష్కారాలపై చర్య**

విద్యుత్ లైన్లను ప్రారంభించిన అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ "తాను 2009 నుండి ప్రతిపక్షంలో ఉండి ప్రజల సమస్యలను దగ్గరగా చూసిన వ్యక్తినని, వాటి తీవ్రత తనకు బాగా తెలుసని పేర్కొన్నారు. "సమస్యలు తెలుసుకోవడం మాత్రమే కాదు... వాటిని పరిష్కరించడం నా బాధ్యత. ఒక్కో సమస్యను ఒక్కో దశలో పరిష్కరిస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెడతా" అని స్పష్టం చేశారు. ప్రజల సేవే లక్ష్యంగా పనిచేస్తున్నానని చెప్పారు.

**110 కుటుంబాలకు ఊపిరి... ప్రమాదాలకు చెక్**

ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్ కారణంగా సుమారు 110 కుటుంబాలు రోజూ భయాందోళనలో జీవించాల్సి వచ్చిందని మంత్రి వివరించారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమించేదని, పలుమార్లు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. శ్రీరాములపల్లి నుంచి ధర్మపురి వరకు విద్యుత్ లైన్‌ను మార్పు చేయడంతో ఇప్పుడు ప్రజలకు పూర్తి భద్రత లభించిందన్నారు.

**ఏళ్ల నిర్లక్ష్యానికి ముగింపు"... బీఆర్ఎస్‌పై విమర్శలు**

గత ప్రభుత్వంపై మంత్రి తీవ్ర విమర్శలు గుప్పించారు. 2014 తర్వాత అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ప్రాణాలకు ముప్పుగా ఉన్న ఈ సమస్యను పట్టించుకోలేదని ఆరోపించారు. "ప్రజల సమస్యలు వినిపించని పాలన వల్లే ఇంతకాలం బాధలు కొనసాగాయి" అని వ్యాఖ్యానించారు.

**అభివృద్ధి దిశగా అడుగులు...**

ధర్మపురి అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఉన్నత చదువులు అందుబాటులోకి తెచ్చామని విద్యార్థుల కోసం కొత్త డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసామన్నారు. బస్ డిపో నిర్మాణం కోసం కట్టుబడి ఉన్నామని పూర్తి దశలో ఫైల్ ఉందని దాన్ని కూడా త్వరలో ప్రకటిస్తామని తెలిపారుగోదావరి పుష్కరాల నాటికి బైపాస్ రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. ధర్మపురిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం అని మంత్రి స్పష్టం చేశారు.

**కోట్ల రూపాయల పనులు..**

ఇప్పటివరకు ప్రభుత్వం రూ.4.60 కోట్లతో విద్యుత్ లైన్ల మార్పిడి పనులు చేపట్టిందనిమిగిలిన గ్రామాల్లో కూడా ఇదే తరహాలో పనులు పూర్తి చేసి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు

**బాధితులకు ఆదరణ... పరిహారం చెక్కుల పంపిణీ**

విద్యుత్ షాక్ కారణంగా పశువులను కోల్పోయిన బాధితులకు మంత్రి చెక్కులు అందజేశారు. నాగారం, గోపులాపూర్, రాయపట్నం, నక్కలపేట గ్రామాలకు చెందిన వారికి రూ.40 వేల చొప్పున, తుమ్మెనాల గ్రామానికి చెందిన వ్యక్తికి రూ.7 వేల పరిహారం అందించారు. ఈ చర్యతో బాధిత కుటుంబాల్లో కొంత ఉపశమనం కలిగిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు

**ఒకప్పుడు భయం ... ఇప్పుడు భద్రత**

11 కేవీ వైర్లు ఇండ్ల పైనుండి తొలగించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. గతం లో తమ ఆవేదనను గుర్తు చేసుకున్నారు. "ఇళ్లపై వైర్లు ఉండటంతో ఎన్నో ప్రమాదాలు జరిగాయని వర్షాకాలంలో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతికే పరిస్థితి ఉండేదని తెలిపారు. ఎన్నోసార్లు గత ప్రభుత్వానికి వినతులు ఇచ్చినా ఫలితం లేకపోయిందని ఇప్పుడు మంత్రి అడ్లూరి చొరవతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది" అంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజు , వైస్ చైర్మన్ ఇందారం రామన్న,
కాంగ్రెస్ నాయకులు సంగనభట్ల దినేష్మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య, ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డివిజన్ వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలు



**మిర్యాలగూడ మార్చి 27(నినాదం):** మిర్యాలగూడ డివిజన్ లో శ్రీరామనవమి సందర్భంగా వాడ వాడలలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణలోని కోదండ రామాలయంలో, హనుమాన్ పేట సీతారామాంజనేయాలయంలో, సీతారాంపురంలోని రామాలయంలో ఘనంగా సీతారాములోరి కల్యాణ మహోత్సవం, మిర్యాలగూడ మండలం చిల్లాపురం గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా సీతారామకళ్యాణ మహోత్సవ ప్రత్యేక పూజలలో నల్లగొండ జిల్లా రైతుబంధు సమితి మాజీఅధ్యక్షులు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డితో ఆలయ చైర్మన్ సాతనూరి వెంకటేశ్వర్లు వాటర్ ట్యాంక్ తండా సర్పంచ్ ధనావత్ వెంకటేశ్వర్లు, ఆలయ గౌరవాధ్యక్షులు సాతునూరి అంజయ్య, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి జానపాటి శ్రీను, రేణుబాబు, బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు. మండలంలోని అవంతిపురం కొండపై శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణం వెంకటేశ్వర స్వామి దేవస్థానం శ్రీ సీతారాములవారి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా ఆలయ ధర్మకర్త డాక్టర్ పద్మావతి, భక్తులు సత్యనారాయణ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు తీర్థప్రసాదాలు సేకరించారు. జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి నీతి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పందిరి వేణు, సకినాల వేలాద్రి, బోయిన రాములు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బిఎం.నాయుడు, పందిరి సత్యనారాయణ, కనపర్తి సత్యప్రసాద్ గంధం కృష్ణ పాల్గొన్నారు. ఈదులగూడ కల్యాణ మండపంలో వైస్ చైర్మన్ గుడిపాటి నవీన్ శిరీషను కౌన్సిలర్ శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బొందు పార్వతి, ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. అదేవిదంగా మెయిన్ బజారు శ్రీరామమందిరం వద్ద సీతరాములు కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు తల్లం అశోక్ లు పాల్గొన్నారు. ఇందిరమ్మ కాలనీలో లో కౌన్సిలర్ ఆడోతు అశోక్, కాంగ్రెస్ నాయకులు నాగునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా మండపాల్లో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు, అన్నదానం నిర్వహించారు.

# నేరప్రవృతి పశువుల కంటే హీనంగా పెచ్చరిల్లుతున్నది

భావోద్వేగంతో నిరసన తెలిపిన వారిపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నాం
మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి




**వనపర్తి ప్రతినిధి, మార్చి 27 (నినాదం) :** నేర ప్రవృతి పశువుల కంటే హీనంగా హెచ్చరిల్లుతున్నదని, భావోద్వేగంతో నిరసన తెలిపిన వారిపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఖండిస్తున్నామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. అక్షర స్కూల్ లో మైనార్టీ విద్యార్థినిపై జరిగిన లైంగిక దాడి మొత్తం సమాజానికి తలవంపు చర్యగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభివర్ణించారు. అత్యంత హేయమైన సంఘటనను యాజమాన్యం పోలీసులకు తెలియజేయకుండా దాచిపెట్టడం నేరమని నిరంజన్ రెడ్డి అన్నారు. బాధితులకు అండగా నిలవాల్సిన పోలీస్ అధికారులు భావోద్వేగంతో నిరసన తెలిపినవారిపై, ప్రశ్నించడానికి వెళ్ళిన బిఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని, భేషరతుగా అక్రమ కేసులు ఎత్తివేయాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. సమాజంలో జరుగుతున్న అసహజ సంఘటనలు మనసును కలచివేస్తున్నాయని, పశువులైన కనీసం తమ ఈడు జోడు చూసుకొంటున్నాయని, అంతకంటే అత్యంతహీనంగా సమాజంలో లైంగిక దాడుల ప్రవృత్తి పెరిగిపోతుం దని అన్నారు. బాల్యం నుంచే వ్యక్తి పెరుగుదలలో సరైన వికాసం, చైతన్యం, లింగగౌరవం పెంపొందించకపోవడం వ్యవస్థలో పెద్దలోటని ఆయన అభిప్రాయపడ్డారు. కొందరు సమగ్రత లోపించి మహిళల వస్త్రాధరణ, వేషాధారణ లైంగిక దాడులకు కారణం అంటూ తమ అపరిపక్వత్తను చాటుకుంటారని అన్నారు. మరీ చిన్నారి బాలికల మీద లైంగిక దాడులకు ఏ వస్త్రాధరణ, వేషాధారణ కారణం? కాబట్టి పెంపకం, పరిసరాల ప్రభావం, కుటుంబాలు వాటి పాత్రను సమర్ధవంతంగా పోషించడం ముఖ్యమని భావించాలని నిరంజన్ రెడ్డి అన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యం

రోడ్డు నెట్వర్క్ బాగుంటే అన్ని మంచిగా ఉంటాయి
ప్రమాదపు మూల మలుపులు లేని రోడ్డు నెట్వర్క్ అభివృద్ధి చేస్తాం
మంజూరైనా రోడ్ల పనులను పరిశీలించి ప్రమాదపు మూలమలుపులను గుర్తించాలని సిబ్బందికి ఆదేశం
మునుగోడు గ్రామస్తులతో చిట్ చాట్‌లో
కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**మునుగోడు, మార్చి 27 (నినాదం):** మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రమాదపు మూలమలుపులు లేని నాణ్యమైన రోడ్ నెట్వర్క్ ను నిర్మించడానికే ముందుకు వెళ్తున్నామని దాంట్లో భాగంగానే ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల పనులలో ప్రమాదపు మూలమలుపులను, బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి ఆ ప్రాంతంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా స్ట్రెయిట్ గా రోడ్లు వేసేలా చేస్తామని అన్నారు మునుగోడు శాసనసభ్యులు, కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొనడానికి మునుగోడు వచ్చిన ఆయన క్యాంపు కార్యాలయంలో గ్రామస్తులు కొంతమంది ముఖ్య నాయకులతో చిట్ చాట్ చేశారు.. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మునుగోడు నియోజకవర్గంలో 5. 5 మీటర్ల వెడల్పుతో రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు... పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 67 రోడ్లు, రోడ్లు మరియు భవనాల శాఖ ఆధ్వర్యంలో 22 రోడ్ల పనులు జరుగుతున్నాయని గ్రామాలకు వెళ్తున్న సందర్భంలో ప్రమాదపు మూలమలుపులు బ్లైండ్ స్పాట్స్ చాలా ఉన్నాయని వాటిని తొలగించి రోడ్డును స్ట్రెయిట్ గా అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటివరకు పనులు జరుగుతున్న రోడ్లలో ప్రమాదపు మూల మలుపులు గుర్తించాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రమాదపు మూలమలుపుల ను తొలగించడంతోపాటు వేగాన్ని తగ్గించే స్పీడ్ బ్రేకర్స్, గ్రామ శివారులో గ్రామాల పేరుతో సైన్ బోర్డులు, బ్లింకింగ్ లైట్స్ ఉండేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామని అవసరమైతే తానే స్వయంగా పరిశీలించి ప్రమాదపు మూలమలుపులు లేని నాణ్యమైన రోడ్లను అభివృద్ధి చేస్తామని అన్నారు.

# ప్రజా సేవే లక్ష్యం.. ప్రగతి పథంలో శివసాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ

సేవా రంగంలో దూసుకుపోతున్న 'శివ సాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ'
ఉగాది శుభాకాంక్షలతో సరికొత్త లక్ష్యాలు





**పెద్దపల్లి మార్చి 27 (నినాదం):** తెలుగు నూతన సంవత్సరం 'శ్రీ పరాభవ నామ సంవత్సర' ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని, శివ సాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఎండి జామల్ల మల్లారెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ కమల, మరియు బృందం ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. "కోట్ల మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతో ప్రారంభం కావాలి" అనే నినాదంతో ప్రారంభమైన ఈ సంస్థ, ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా తన కార్యకలాపాలను విస్తరిస్తూ అగ్రగామిగా నిలుస్తోంది.

**బహుముఖ సేవలకు చిరునామా**

2016లో స్థాపించబడిన ఈ సంస్థ (CIN No. U01229 TG 016 PTC 113140), కేవలం ఒక రంగానికే పరిమితం కాకుండా సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే అనేక విభాగాల్లో రాణిస్తోంది. ప్రధానంగా ఉప్పల్ రింగ్ రోడ్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థ, తెలంగాణ వ్యాప్తంగా తన శాఖలను ఏర్పాటు చేసి వేలాది మందికి అండగా నిలుస్తోంది. అలాగే ఇందులో పని చేసే వారికి ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తుంది.

**ప్రధాన సేవా విభాగాలు:**

సంస్థ చేపడుతున్న ముఖ్యమైన కార్యకలాపాలు ఇవే:
**మహిళా సాధికారత:** మహిళా గ్రూపులు మరియు ఫార్మర్ గ్రూపుల ద్వారా గ్రామీణ మరియు పట్టణ అభివృద్ధికి కృషి.
**బీమా సేవలు:** లైఫ్ ఇన్సూరెన్స్, హెల్త్ ఇన్సూరెన్స్ మరియు వెహికల్ ఇన్సూరెన్స్ వంటి సేవలను ప్రజలకు చేరువ చేయడం
**వ్యవసాయం- పర్యావరణం:** వర్మీ కంపోస్ట్ తయారీ మరియు ఆయుర్వేద మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి
**వ్యాపార విభాగాలు:** రియల్ ఎస్టేట్ బిజినెస్, సోలార్ సిస్టమ్ బిజినెస్ మరియు ఆల్ కన్‌స్ట్రక్షన్ పనులు. సామాజిక బాధ్యత: చీ+టా ప్రాజెక్ట్స్, సోషల్ మీడియా నిర్వహణ మరియు ఇన్కమ్ టాక్స్ వర్క్స్ వంటి విభిన్న సేవలు. అవకాశాల వేదిక తమ సభ్యులకు పొదుపు మరియు రుణ సదుపాయాలను కల్పించడంతో పాటు, 3 సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్లు మరియు రికరింగ్ డిపాజిట్ల సౌకర్యాన్ని కూడా సంస్థ అందిస్తోంది. విద్యార్థులకు ఉచిత శిక్షణ మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఈ సంస్థ జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో తనదైన ముద్ర వేస్తోంది. మరిన్ని వివరాల కోసం 81878 26256,, 9849183328 నంబర్ల ద్వారా సంప్రదించవచ్చని సంస్థ ప్రతినిధులు తెలిపారు.




# ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు రాముడు

కాంగ్రెస్ మౌలాలి డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్



**మల్కాజిగిరి, మార్చి 27(నినాదం) :** ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత ప్రజా పాలకుడు శ్రీరాముడని, ఆ సీతారాముల అనుగ్రహం, చల్లని దీవెనలు రాష్ట్ర ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని కాంగ్రెస్ పార్టీ మౌలాలి డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్ ఆకాంక్షించారు. శ్రీరామ నవమి పండుగ సందర్భంగా హనుమన్ నగర్ ఆర్యవైశ్య సంఘం, టిపి కాలని, చందాబాద్, ఎం జె కాలనీ, గ్రీన్ హిల్స్ కాలనీ, హనుమాన్ నగర్, భారత్ నగర్, పలు ఏరియాలలో నిర్వహించిన శ్రీ సీతా రామ కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిదులుగా మౌలాలి డివిజన్ కాంటెస్టెంట్ అభ్యర్థి పోతుల ఉమా మహేశ్వరీ, కాంగ్రెస్ మౌలాలి డివిజన్ అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని శ్రీ సీతా రాముల దివ్య కళ్యాణాన్ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మౌలాలి డివిజన్ సీనియర్ నాయకులు వెంకటేష్, చినుకు శ్రీనివాస్, ఫారుక్, మంద భాస్కర్, చందు, రైముద్దీన్, సలీం, నరసింహ ముదిరాజ్, మల్లేష్, అనిల్ గౌడ్, ప్రేమ్, యాకూబ్, మమ్మద్, మహిళా నాయకురాలు భాగ్యారాణి, మహిమదా, జాన్సి యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్, హరీష్, లక్ష్మణ్, నాని, తనీష్, నితీష్, రిషి, మీరజ్, పాల్గొన్నారు.

సంపాదకీయం

# ఆందోళనకరంగా ద్రవ్యోల్బణం

పశ్చిమాసియా సంక్షోభం, ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల పెంపు.. ఇలా అనేక అంశాలు దేశ ఆర్థిక ప్రగతికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ధరల పెరుగుదల, చమురు అలభ్యత, రూపాయి మారకం విలువ పెరగడం వెరసి భారత జిడిపిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ద్రవ్యోల్బణానికి కూడా కారణమవుతోంది. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు ఇప్పట్లో సద్దుమణిగేలా లేవు. దీంతో ఇధంన లభ్యత ఎలా ఉంటుందో తెలియదు. ధరలు పెరగడం మాట ఎలా ఉన్నా అభ్యత అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ట్రంప్, ఇరాన్ ` పట్టుదలతో ఈ సంక్షోభం ఇప్పట్లో చల్లారేలా లేదు. ఈ ఏడాదికిగాను దేశ జీడీపీ వృద్ధి అంచనాలను అమెరికా బహుళజాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం గోల్డ్‌మన్ సాచ్స్ మరోసారి తగ్గించింది. అమెరికా`ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధంతో పశ్చిమాసియా భగ్గుమంటున్న విషయం తెలిసిందే. గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, ఎల్‌పీజీ, ఎలఎన్‌జీ ఉత్పత్తికి బ్రేకులుపడ్డాయి. భారత ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతుండగా.. మిడిల్ ఈస్ట్ నుంచి పెద్ద ఎత్తునే వస్తున్నది. గత నెల 28 నుంచి ఇరాన్‌పై అమెరికా`ఇజ్రాయెల్ వైమానిక దాడులను ప్రారంభించాయి. అప్పట్నుంచి గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. అమెరికాకు మద్దతిస్తున్నారని పొరుగు దేశాలైన కువైట్, ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్‌లపై ఇరాన్ దాడులు చేస్తున్నది. ఆయా దేశాల్లోని చమురు, గ్యాస్ క్షేత్రాలనే లక్ష్యంగా చేసుకుని క్షిపణులు, డ్రోన్లను ప్రయోగిస్తున్నది. దీంతో క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి నిలిచిపోయింది. పైగా మిడిల్ ఈస్ట్ నుంచి భారత్, చైనా సహా ఇతర దేశాలకు జరిగే రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని కూడా ఇరాన్ మూసేసింది. ఈ పరిణామం ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌లో ముడి చమురు, గ్యాస్ ధరల పెరుగుదలకు దారితీసింది. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో ఆయా పెట్రో ఉత్పత్తుల ధరలూ పెరిగాయి. గ్యాస్ కొరత కూడా కనిపిస్తుండగా, దేశవ్యాప్తంగా చాలా హోటళ్లు, ఇతర గ్యాస్ ఆధారిత వ్యాపారాలు, పరిశ్రమలు మూతబడుతున్నదీ చూస్తూనే ఉన్నాం. ఎరువుల తయారీ కుంటుబడి వ్యవసాయ రంగం సైతం ప్రభావితం అవుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈసారి దేశ ఆర్థిక వృద్ధిరేటు 5.9 శాతాన్ని మించి ఉండబోదని గోల్డ్‌మన్ సాచ్స్ తాజాగా అభిప్రాయపడింది. 2026లో దేశ జీడీపీ వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని గతంలో గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేసింది. అయితే ఈ నెల 13న దీన్ని 6.5 శాతానికి తగ్గించింది. ఇప్పుడు 5.9 శాతానికి కుదించింది. కేవలం 11 రోజుల్లోనే అర శాతానికి పైగా కోత పెట్టడం గమనార్హం. దీని వెనుక మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే కారణంగా ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఇక రవాణా రంగంపైనా భారం పడుతుండగా.. పెరిగిన పెట్రోల్, డీజిల్ రేట్లతో ఆయా వస్తూత్పత్తులన్నింటి ధరలూ ఎగబాకి ద్రవ్యోల్బణం విజృంభిస్తున్నది. ఇది మరింత ముదిరితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాబోయే ద్రవ్య సమీక్షల్లో కఠిన ద్రవ్య విధానాన్ని అనుసరించే అవకాశాలు లేకపోలేదు. దీంతో వడ్డీరేట్లు పెరుగడం ఖాయమనే మెజారిటీ విశ్లేషకులు అంటున్నారు. అదే జరిగితే రుణ లభ్యత క్షీణించి అన్ని రంగాల్లో కార్యకలాపాలు మందగిస్తాయి. మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితమవుతుందని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ముడి చమురు దిగుమతుల్లో ఏర్పడిన అంతరాయం.. దేశంలో అన్నింటి ధరల్ని ఎగదోయ గలదని గోల్డ్‌మన్ సాచ్స్ హెచ్చరిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఏడాది ద్రవ్యోల్బణం 4.6 శాతానికి పెరుగవచ్చని అంచనా వేస్తున్నది. గతంలో ఇది 3.9 శాతంగానే ఉండటం గమనార్హం. కాగా, హర్మూజ్ జలసంధిలో వచ్చే నెల ప్రథమార్ధం వరకు పరిస్థితులు ఇలాగే ఉంటాయన్న అభిప్రాయాన్ని గోల్డ్‌మన్ సాచ్స్ వెలిబుచ్చుతున్నది. దీంతో భారత్ జీడీపీ అంచనాలు ఇంకా తగ్గిపోయినా ఆశ్చర్యం లేదన్న సంకేతాలు వస్తున్నాయి. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయిలో కదలాడుతున్నది. దీంతో ఈ ఒత్తిడి ఆర్బీఐపై తప్పక ఉంటుందని, అందుకే రెపోరేటు 50 బేసిస్ పాయింట్లు పెరిగే వీలున్నదని గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా వేస్తున్నది. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా రూపీ వాల్యూ దాదాపు 4 శాతం పతనమైంది. సోమవారం తొలిసారి 94 మార్కునూ దాటేసింది. నిజానికి గత ఏడాది మొత్తంగా 4.7 శాతం పతనం నమోదైంది. కానీ ఈ 3 నెలల్లోనే ఇంచుమించుగా అంతటి నష్టాలు వాటిల్లాయి. రూపాయి విలువ పడిపోయినకొద్దీ దేశంలోకి వచ్చే దిగుమతులు ఖరీదవుతాయి. చివరకు ఈ భారం వినియోగ దారులపైనే పడుతుంది. ఇక దేశీయ కరెంట్ ఖాతా లోటు జీడీపీలో ఈ సంవత్సరం 2 శాతానికి పెరుగవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థపై విదేశీ రుణ భారం పెరుగు తుందని, డాలర్ నిల్వలు పడిపోయే వీలుందని అంటున్నది. దీనికితోడు రూపాయి కనిష్ట స్థాయికి పడిపోతోంది. మారకం విలువ పడిపోవడం వివిధ రంగాలపై ప్రభావం చూపుతోంది. దీంతో రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం మరింత ఆందోళనకరంగా ఉండనుంది.

# సంగీత పరిశ్రమలో మహిళలకు స్థానం లేదా !

**(28 మార్చి "అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం" సందర్భంగా)**



సంగీత రంగంలో మహిళల పాత్రను ప్రశంసించడం, వారిని ప్రోత్సహించడం, ఈ రంగంలో లింగ సమానత్వాన్ని సాధించడం, మంచి మహిళా సంగీత విద్వాంసులను సన్మానించడం, మహిళా సంగీతకారుల ప్రభావాన్ని గుర్తు చేసుకోవడం, భవిష్యత్తులో మహిళా సంగీతకారులకు సముచిత స్థానం కల్పించడం లాంటి అంశాల్లో పాల్గొనడానికి ప్రతి ఏటా 28 మార్చి రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం (ఇంటర్నేషనల్ వూమెన్ ఇన్ మ్యూజిక్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. సంగీత పరిశ్రమలో మహిళలు చాలా చక్కువగా ఉన్నారు. మహిళామణులకు తగిన ప్రోత్సాహం కూడా కరువైంది. నేపథ్య గానం, సంగీత దర్శకత్వం, సంగీత నిర్మాతలు, సంగీత కళాకారులు లాంటి రంగాల్లో పురుషుల ఆధిపత్యం అనాదిగా కొనసాగుతూ వస్తున్నది.

భారత సంగీత రంగంలో మహిళా కళాకారులు:

భారతీయ సంగీతరంగాన్ని సుసంపన్నం చేసిన మహిళల్లో ఎం ఎస్ విజయలక్ష్మి, లతా మంగేష్కర్, ఆశా బోంస్లే, శ్రేయ ఘోషాల్ లాంటి వారు ఎందరో ఉన్నారు. వీరు తమ సంగీత కళతో మానవాళిని మెప్పించి పురుషాధిక్యతను అధిగమించి తమదైన ముద్రను వేయడం హర్షదాయకం. ప్రముఖ గాయనీమణుల్లో లతా మంగేష్కర్, శ్రేయా ఘోషాన్ లాంటి వారు ఉండగా, శాస్త్రీయ సంగీతంలో ఎం ఎస్ సుబ్బలక్ష్మి, గౌహర్ జాన్, అక్తరి బాయి లాంటి మహిళలు ఉన్నారు. సంగీత వాయిద్యకారుల వర్గంలో మృదంగం, తబలా, ఘటం, కంజీరా వంటి వాయిద్యాలను వాయించే మహిళలు కూడా కొందరు ఉండడం విశేషం. రుద్ర వీణ కళాకారిణి జ్యోతి హెగ్డే, సంగీత దర్శకులుగా ఉషా ఖన్నా, జద్దన్ బాయి, సరస్వతి దేవి లాంటి కళాకారులు ఉన్నారు. ఆధునిక భారతీయ సంగీత ప్రపంచంలో శ్రేయ ఘోషల్, నేహా కక్కర్, సన్నిధి చౌహాన్ వంటి నేటి మేటి తరం గాయనీమణులా ప్రపంచ గుర్తింపును కూడా పొందారు. తెలుగు సంగీత ప్రపంచంలో ఎం ఎం శ్రీలేఖ, భానుమతి రామకృష్ణ లాంటి ప్రముఖులు సంగీత దర్శకులుగా మంచి పేరు తెచ్చుకున్నారు. అలాగే గాయనీమణులుగా సుశీల, జానకి, చిత్ర, సునితా, మంగ్లీ లాంటి వర్తమాన కళాకారులు తమ ప్రతిభతో ప్రేక్షకుల మన్ననలు పొందుతున్నారు.

సంగీత పరిశ్రమలో లింగ సమానత్వం:

ప్రపంచవ్యాప్తంగా మహిళలు సంగీత ప్రపంచాన్ని ఉర్రూతలూగించారు. కాని వారి సంఖ్య చాలా స్వల్పం. అర్థాలు ఫ్రాక్లిన్, బయాంన్స్, లేదా మంగేష్కర్ లాంటి ప్రపంచ ప్రఖ్యాత సంగీతకారులు మానవాళిపై చెరగని ముద్రను వేసారు. సంగీత పరిశ్రమ పురుషుల చేతుల్లో ఉన్నది. ఆసక్తి, అర్హత కలిగిన మహిళలకు సహితం సరైన అవకాశాలు దొరకడం లేదు. సంగీత రంగంలో మహిళలకు నాయకత్వ బాధ్యతలు ఇవ్వడానికి పురుష సమాజం సిద్ధంగా లేదు. తగిన గుర్తింపు, వేతన వ్యత్యాసాలు మహిళలను వేధిస్తున్నాయి. సంగీర ప్రపంచంలో అడుగిడడానికి మహిళలకు పరిమితులు విధించబడ్డాయి. మహిళా సంగీత విద్వాంసుల నైపుణ్యాలను గుర్తించడం, అర్హత కలిగిన మహిళలకు అవకాశాలు ఇవ్వడం, మహిళా సందగీతకారులకు స్వేచ్చను ఇవ్వడం, మహిళల సంగీత కచేరీలు లేదా ప్రదర్శనలు ఏర్పాటు చేయడం, సంగీత పరిశ్రమలో లింగ సమానత్వ సాధనకు కృషి చేయడం లాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలి.

**రుద్ర వీణ కళాకారిణి జ్యోతి హెగ్డే, సంగీత దర్శకులుగా ఉషా ఖన్నా, జద్దన్ బాయి, సరస్వతి దేవి లాంటి కళాకారులు ఉన్నారు. ఆధునిక భారతీయ సంగీత ప్రపంచంలో శ్రేయ ఘోషల్, నేహా కక్కర్, సన్నిధి చౌహాన్ వంటి నేటి మేటి తరం గాయనీమణులా ప్రపంచ గుర్తింపును కూడా పొందారు.**

సంగీతం ఓ శక్తివంతమైన విశ్వ భాష :

సంగీతం అత్యంత ప్రభావితం చేయగల ఓ విశ్వ భాష. మాటలు ఆగిన చోట సంగీత స్వరాల పలుకులు ప్రారంభం అవుతుంది. సంగీతం ఓ దివ్య ఔషధం. మాటల్లో చెప్పలేని విషయాలను సంగీత మాధ్యమంగా వర్ణించవచ్చు. సంగీతం లేని జీవితం నిస్సారం. ప్రపంచాన్ని జాగృతం చేయగల శక్తి సంగీతానికి ఉంటుంది. సాంప్రదాయ సంగీతం నుంచి ఆధునిక సంగీతం వరకు మహిళలు తమ అంకితభావం, నైపుణ్యంతో దేశ సంగీత చిత్రపటాన్ని నిరంతరం పునర్నిర్వహిస్తూనే ఉన్నారు, భవిష్యత్తులో నిర్వహిస్తారు కూడా. సంగీతం ఓ నిర్మలమైన నదీ ప్రవాహం. సంగీతానికి ఎల్లలు లేవు.

"అంతర్జాతీయ మహిళా సంగీత కళాకారుల దినోత్సవం" సందర్భంగా ఇలాంటి అత్యంత ప్రభావం కలిగిన సంగీత జగత్తులోకి అర్హులు, ఆసక్తి మెండుగా ఉన్న మహిళామణులను ఆహ్వానిద్దాం, వారి సంగీత రాగాలను ఆస్వాదిద్దాం.

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

## తమిళనాడులో సీట్ల పంపకాలపై అన్నామలై అసంతృప్తి

### బిజెపి గెలిచే చోట కేటాయించలేదని అసహనం
### కేంద్ర నాయకత్వానికి లేఖ రాసినట్లు సమాచారం

చెన్నై, : తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ`అన్నాడీఎంకే మధ్య సీట్ల పంపకాలపై బీజేపీ రాష్ట్ర శాఖ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని పార్టీ వర్గాల సమాచారం. సీట్ల పంపకాల ఒప్పందంలో భాగంగా బీజేపీకి కేటాయించిన నియోజకవర్గాలపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేస్తూ ఢిల్లీలోని పార్టీ అధిష్ఠానానికి లేఖ రాసినట్టు ఆ వర్గాలు తెలిపాయి. బీజేపీ తేలిగ్గా గెలిచే కినితుకడవు నియోజకవర్గంతో సహా పలు నియోజకవర్గాలను అన్నాడీఎంకే కేటాయించలేదని అన్నామలై ఆ లేఖలో పేర్కొన్నట్టు తెలుస్తోంది. తమిళనాడు ఎన్నికల్లో తాను పోటీ చేసేది లేదని కూడా పార్టీ అధిష్ఠానానికి తెలియజేసినట్టు చెబుతున్నారు. సీట్ల పంపకాల ఒప్పందంపై కినితుకడవు నియోజకవర్గంలో బీజేపీ కార్యకర్తలు గురువారంనాడు నిరనస ప్రదర్శన కూడా నిర్వహించారు. తమిళనాడులో ఎన్డీయే ఇటీవల సీట్ల కేటాయింపు ఒప్పందాన్ని ఖరారు చేసింది. 169 సీట్లలో అన్నాడీఎంకే పోటీ చేయనుండగా, బీజేపీకి 27 సీట్లు కేటాయించింది. ఇతర భాగస్వామ్య పార్టీలైన పీఎంకే 18, ఏఎంఎంకే 11 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. 27 సీట్లతో బీజేపీ సంతృప్తికరంగా ఉన్నట్టు ఆపార్టీ తమిళనాడు ఇన్‌చార్జి, కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. 234 మంది సభ్యులున్న తమిళనాడు అసెంబ్లీకి ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.



# వీధి కుక్కల బెడదతో ప్రజా భద్రతకు ముప్పు!

మన దేశ వ్యాప్తంగా,ముఖ్యంగా పట్టణాలు–పల్లెల్లో వీధి కుక్కల సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. వీధుల్లో గుంపులుగా తిరిగే ఈ శునకాలు చిన్నా–పెద్దా అనే తేడా లేకుండా ప్రజలపై దాడులు చేయడం వల్ల భయం, ప్రాణ రక్షణ భావం పెరుగుతోంది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఈ బెడదకు అత్యంత బలహీన వర్గాలుగా మారుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, సాయంత్రం ఆడుకునే బాలలు, ఉదయం వాకింగ్‌కు వెళ్లే పెద్దలు——అందరూ వీధి కుక్కల భయంతో బయటకు రావడానికి సంకోచించే పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న కొన్ని సంఘటనలు ఈ సమస్య తీవ్రతను మరింత స్పష్టంగా చూపిస్తున్నాయి. తెలంగాణలోని భువనగిరిలో ఇంటి బయట ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన ప్రజలను కలచివేసింది. అలాగే గుంటూరు, మెదక్, హనుమకొండ వంటి ప్రాంతాల్లో కూడా కుక్కల దాడులు వరుసగా జరుగు తున్నాయి. కొన్ని చోట్ల ఒకేసారి పలువురిపై దాడులు జరగడం పరిస్థితి ఎంత ప్రమాదకరంగా మారిందో సూచిస్తోంది.

వీధి కుక్కల గుంపులు రాత్రిపూట మాత్రమే కాకుండా పగటిపూట కూడా రోడ్లపై తిరుగుతూ వాహనదారులను వెంబడించడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి.వీధుల్లో అకస్మాత్తుగా కుక్కలు దూసుకొచ్చి వాహనాలను వెంబడించడం వల్ల డ్రైవర్లు నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉంది.ఇది కేవలం వ్యక్తిగత ప్రమాదమే కాకుండా సామూహిక భద్రతకు ముప్పుగా మారుతోంది. ఈ సమస్య ప్రజారోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. కుక్క కాట్ల ద్వారా వ్యాపించే రేబిస్ వ్యాధి అత్యంత ప్రాణాంతకమైనది. ఒకసారి రేబిస్ లక్షణాలు కనిపిస్తే ప్రాణాపాయం తప్పదు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది సుమారు 60 వేల మంది రేబిస్ వల్ల ప్రాణాలు కోల్పోతుండగా, అందులో గణనీయమైన శాతం భారతదేశానిదే కావడం ఆందోళనకరం. దేశంలో 2030 నాటికి రేబిస్ నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, నేలస్థాయిలో చర్యలు వలన ఆశించినంతగా అమలవడం లేదు. పశుసంవర్ధక శాఖ గణాంకాల ప్రకారం దేశ వ్యాప్తంగా కోట్ల సంఖ్యలో వీధి కుక్కలు ఉన్నట్లు అంచనా. అధికారిక లెక్కలు ఒకటి చెబితే, వాస్తవ పరిస్థితి మరింత తీవ్రమై ఉండొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నగరాల్లో చెత్త నిర్వహణలో లోపాలు, ఎక్కడపడితే అక్కడ ఆహార వ్యర్థాలు పారవేయడం, మాంసపు మిగులు భాగాలు రోడ్లపై పడేయడం వంటి కారణాలు వీధి కుక్కల సంఖ్య పెరగడానికి దోహదపడుతున్నాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు కూడా కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల నుంచి వీధి కుక్కలను రక్షణ కేంద్రాలకు తరలించడం, వాటికి సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయడం, రేబిస్ టీకాలు వేయడం వంటి చర్యలు తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించింది. అయితే స్థానిక సంస్థలు, మున్సిపాలిటీలు ఈ చర్యలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమవుతున్నాయి. సిబ్బంది కొరత, నిధుల లేమి, సమన్వయాభావం వంటి కారణాలు ఈ సమస్యను మరింత క్లిష్టంగా మారుస్తున్నాయి. వీధి కుక్కల సమస్యను కేవలం ఒక జంతు సమస్యగా కాకుండా, ప్రజా ఆరోగ్యం మరియు భద్రతకు సంబంధించిన అత్యవసర అంశంగా చూడాలి. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో శునకాల నియంత్రణ చర్యలు చేపట్టాలి. ప్రతి పట్టణంలో కుక్కల శస్త్రచికిత్స కేంద్రాలు, టీకా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రేబిస్ టీకాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చూడాలి. అదే విధంగా ప్రజల బాధ్యత కూడా ఎంతో కీలకం. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, మున్సిపాలిటీ ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుల్లో మాత్రమే పారవేయాలి. వీధి కుక్కలకు ఆహారం పెట్టేటప్పుడు నియమ నిబంధనలు పాటించాలి. చిన్నపిల్లలను ఒంటరిగా బయటకు పంపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. కుక్క కాటు జరిగిన వెంటనే సమీప వైద్య కేంద్రంలో చికిత్స తీసుకోవడం తప్పనిసరి. అంతిమంగా, వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, ప్రజలు——మూడు వర్గాలు కలిసి పనిచేయాలి. కఠిన చర్యలు, అవగాహన కార్యక్రమాలు, శాస్త్రీయ విధానాల అమలు——ఈ మూడు కలిసివచ్చినప్పుడే ప్రజా భద్రతను కాపాడగలం. లేదంటే ఈ సమస్య మరింత తీవ్రమై, భవిష్యత్తులో పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశముంది.

***మేకిరి దామోదర్***
**సోషల్ అనలిస్ట్, జిల్లా: వరంగల్, ఫోన్:9573666650.**

# జర్నలిస్టులకు మార్గదర్శి కేశవ పిళ్ళై

**మార్చి 28...పట్టు కేశవ పిళ్ళై వర్ధంతి**

**దీవాన్ బహదూర్ పట్టు కేశవ పిళ్ళై (అక్టోబరు 8, 1860 - మార్చి 28, 1933) భారతీయ పాత్రికేయుడు, రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు.**

పట్టు కేశవపిళ్లే తమిళనాడు లోని ఉత్తర ఆర్కాటు జిల్లాలో వేంకటాచలం, సుబ్బమ్మ దంపతులకు 1860, అక్టోబరు 8వ తేదీన జన్మించాడు. మద్రాసులో ఇతని విద్యాభ్యాసం జరిగింది. ఆయన హిందూ పత్రికలో విలేఖరిగా తన వృత్తిని ఆరంభించాడు. అనంతపురం జిల్లా, గుత్తిలో కరెస్పాండెంటుగా ఆయన 1883లో తన 22వ యేట నియమించ బడ్డాడు. గుత్తిలో స్థిరపడటం వలన పట్టు కేశవపిళ్లైను ప్రజలు "గుత్తి కేశవపిళ్లై"గా పిలువ సాగారు.

1893, అక్టోబర్ 4వ తేదీన బ్రిటిష్ సైనికుల అత్యాచారం నుండి యిద్దరు హిందూ మహిళలను రక్షించే క్రమంలో, గుత్తిలోని రైలుగేటు కీపర్ గూళిపాలెం హంపన్న ప్రాణాలొడ్డాడు. ఈ సంఘటనలో బ్రిటిష్ సైనికులు హంపన్నను కాల్చి చంపారు. ఈ సంఘటన గురించి గుత్తి కేశవపిళ్లే హిందూ పత్రికకు వార్త పంపగా అది ప్రముఖంగా ప్రచురింప బడింది. ఈ వృత్తాంత మంతా హిందూ పత్రికలో రావడంతో ఇంగ్లీషు వారు ఆంగ్లేయులకు ఏర్పరిచిన ప్రత్యేకమైన ప్రతిపత్తులతో కూడిన కోర్టులో విచారణ జరిపించారు. అప్పట్లో కేశవపిళ్లే గుత్తిలో సెకెండ్ గ్రేడ్ ప్లీడర్‌గా ప్రాక్టీసు చేసేవాడు. ఈ సంఘటన గురించి బ్రిటిష్ సైనికులకు వ్యతిరేకంగా వాదించాడు. అక్కడ ఉన్న జ్యూరీ వారిలో అధికభాగం ఆంగ్లేయులు, మిగిలిన కొందరు వారిపై జీవనము ఆధారపడిన దుబాసీలు. కోర్టులో ఆ స్త్రీలు వ్యభిచారులని, హంపన్న వ్యభిచరింప జేసే వ్యాపారియని వ్యభిచారం విషయంలో డబ్బు ఎక్కువ తక్కువల్లో తమను కొట్టవచ్చాడని, ఆత్మరక్షణార్థం తాము కాల్చామని వాదించారు. వాదనలు నడుస్తూండగానే ఈ కేసుకు వ్యతిరేకంగా హిందూ పత్రికలో చాలా వార్తలు, అభిప్రాయాలు వచ్చాయి. చివరకు ఈ కేసులో వ్యభిచార వ్యవహారంలో తేడా రావడంతోనే ఈ ఘటన జరిగిందని, హంపన్న అమాయకుడేమీ కాదన్న వ్యాఖ్యలు చేస్తూ ఈ నేపథ్యంలో ఆంగ్ల సైనికుల దోషం ఏమీ లేదని తేల్చి, నిర్దోషులుగా విడిచి పెట్టాయి. ఇది జాత్యహంకారానికి ఉదాహరణ అంటూ హిందూ దినపత్రిక తీవ్రంగా ఖండించింది. స్థానికులు వీరుడైన హంపన్నపై ఇటువంటి ఘోరారోపణ చేయడాన్ని సహించలేక ఓ స్మారక చిహ్నం నిర్మించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. దీనికి హిందూ పత్రిక సహకరించి, తమ పత్రిక ద్వారా విరాళాల కోసం ప్రయత్నాలు సాగించింది. గ్రామస్థులు, హిందూపత్రికవారూ విరాళాలిచ్చిన దాతల సహకారంతో హంపన్న స్మారక చిహ్నాన్ని నిర్మించారు. స్మారక సంఘం వారు స్మారక చిహ్నం నిర్మాణానికి తొమ్మిది చదరపు టడుగుల స్థలాన్ని కొనుగోలు చేసి, దానిపై ఏడడుగుల ఎత్తుగల రాతిస్తంభం నిలబెట్టి, దానికి ఓ స్మారక ఫలకాన్ని వ్రాయించి పెట్టారు. చుట్టూ ఆవరణ గోడ కూడా కట్టించారు. ఆ శిలాఫలకంపై ఆంగ్లంలో ఈ క్రింది విధంగా చెక్కారు. "Here lie the remains of Goolapalien Hampanna, the Gate keeper, who while defending two Hindu women against a party of European soldiers near the Guntakkal rest camp was shot by one of them on October 4, 1893. He died here on October 5. Raised by European and Indian admirers" స్మారక చిహ్నం ఏర్పాటు, తమకు అవమాన కరమని కొందరు బ్రిటీష్ అధికారులకు తోచి, స్థల విక్రయం రద్దుచేయాలని ప్రయత్నించారు. కాని వ్రాయించిన దస్తావేజు విస్పష్టముగా నుండడం, దానిలో కూడా స్థలం కొనుగోలు స్మారక చిహ్నం నెలకొల్పేందుకే నన్న సంగతి వ్రాసి వుండడం కారణాలతో ఏమీ చేయలేక పోయారు. డిప్యూటీ పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ సూపరింటెండెంట్ అయిన లెగ్గట్ ఈ స్మారక చిహ్నాన్ని చూసి చాలా ఆగ్రహించారు. దీనిని ఎలాగైనా తొలగించాలని సిఫారసు చేస్తూ చెన్నపట్టణ ప్రభుత్వం వారికి వ్రాశారు. గుత్తి విలేఖరి యైన కేశవపిళ్లైపై రాజద్రోహ నేరం కింద కేసు నమోదు చేయాలని ప్రయత్నాలు చేశారు. ఐతే ఇవేవీ జరగలేదు. మద్రాసు గవర్నర్ వెన్లక్ ప్రభుత్వం హంపన్న స్మారక చిహ్నం ఏమీ చేయరాదన్న ఉత్తర్వు చేసింది. ఈ సంఘటనతో హంపన్నతో పాటుగా గుత్తి కేశవపిళ్లే కూడా ప్రజల మనసుల్లో స్థానం సంపాదించాడు.

హంపన్న వృత్తాంతంతో ఆయనను స్థానిక ప్రభుత్వం గుర్తించి అనంతపురం, కర్నూలు, బళ్ళారి జిల్లాలకు జిల్లా బోర్డు సభ్యుడిని చేసింది. 1916–17లో ఇతడు కాంగ్రెస్ సభ్యునిగా చురుగ్గా పని చేశాడు. మద్రాసు శాసన మండలి సభ్యునిగా ఎన్నుకో బడ్డాడు. ఆయన గుత్తి తాలూకా బోర్డు ఉపాధ్యక్షుడిగా కూడా పని చేశాడు. మద్రాసు ఫారెస్ట్ సభ్యుడిగా సేవలను అందించాడు. శ్రీలంకలోని భారతీయ వర్తకుల కోరిక మేరకు అక్కడికి వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి ఒక నివేదికను సమర్పించాడు. 1885లో బొంబాయిలో జరిగిన స్వాతంత్ర్యోద్యమ ప్రథమ మహాసభకు అయన హాజరయ్యాడు.

కేశవ పిళ్ళై గుత్తి నగరపాలికకు ఎన్నికై, నగర పాలిక సభ్యుడుగా పనిచేశాడు. చివరకు ఆయన నగర పాలికలకు ప్రాతినిధ్యం వహించడానికి మద్రాసు శాసన మండలికి ఎన్నికయ్యాడు.

కేశవ పిళ్ళై తన తొలినాటి నుండి రాజకీయాల్లో ఆసక్తి చూపాడు. 1885, డిసెంబరు 28న బొంబాయిలో జరిగిన తొలి భారత జాతీయ కాంగ్రేసు సమావేశంలో, గుత్తి పట్టణ ప్రతినిధిగా పాల్గొన్నాడు. ఆ తర్వాత మరింత తీవ్రవాద పద్ధతులను అవలంబించి కొన్నిసార్లు జైలుకు కూడా వెళ్ళాడు. ఆయన జస్టిస్ పార్టీని, ద్రవిడ ఉద్యమాన్ని గట్టిగా వ్యతిరేకించాడు.

కేశవ పిళ్ళై మద్రాసు శాసన మండలిలో చాలాకాలం పాటు పనిచేశాడు. సభలో అనేక సంస్కరణా ప్రతిపాదనలను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకు దక్కుతుంది. పానగల్ రాజా ప్రభుత్వం ఆమోదించిన జైలు మార్గదర్శకాలు, జైలు కమిషన్ యొక్క ప్రధాన రచయిత పిళ్ళై. మద్రాసు అటవీ కమిషన్ సృష్టికర్త కూడా ఆయనే. ఆ తర్వాత కేశవ పిళ్ళై శాసనమండలి ఉపాధ్యక్షుడిగా కూడా ఎన్నికై, ఆ హోదాలో కొంతకాలం పని చేశాడు.

ఆయన సేవా దృక్పథాన్ని గుర్తించి అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఇతడిని రావు బహద్దూర్ బిరుదుతో సత్కరించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**



# వంకాయ పెరుగు పచ్చడి


## ఇలా చేస్తే క్షణాల్లో గిన్నెంతా ఖాళీ పక్కా



**కావాల్సిన పదార్థాలు:**
6 వంకాయ , రెండు కప్పులు పెరుగు, రుచికి తగినంత ఉప్పు, అర టేబుల్ స్పూన్ మినపప్పు, ఒక టేబుల్ స్పూన్ కారం, అర టేబుల్ స్పూన్ పసుపు, ఒక టేబుల్ స్పూన్ అల్లం పేస్ట్, ఆవాలు, రెండు టేబుల్ స్పూన్స్ నూనె, కరివేపాకు ఆకులు , కొత్తిమీరను తీసుకోవాలి.

**ముందుగా మజ్జిగను ఇలా రెడీ చేసుకోండి:**

ముందుగా వంకాయలను తీసుకుని వాటిని బాగా కడిగి ముక్కలుగా కట్ చేసుకుని ఒక ప్లేట్ లో పెట్టుకోవాలి. ఇక ఇప్పుడు ఒక గిన్నెలో పెరుగును తీసుకుని, ఒక గ్లాస్ నీళ్లు పోసి మజ్జిగ కవ్వంతో తిప్పుకోవాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని పక్కన పెట్టుకోండి.



వేసవి కాలంలో ఈ వంకాయ మజ్జిగ పులుసును తాగితే ఒంట్లో ఉన్న వేడి మొత్తం పోతోంది. మీకు ఇది మరింత రుచిగా కావాలంటే దీనిలో కొద్దిగా కొత్తిమీర టేస్టీగా ఉంటుంది. వేడి వేడి అన్నంలో తింటే ఇంకా రుచిగా ఉంటుంది. దానిలో ఉల్లిపాయ ముక్కలు వేసుకుంటే అదిరిపోతోంది.

ఇప్పుడు గ్యాస్ లేదా కట్టెల పొయ్యి వెలిగించి పెనం పెట్టి వంకాయ ముక్కలు, కొద్దిగా పసుపు, ఉప్పు వేసి బాగా ఉడికించాలి. ఈ ముక్కలు మెత్తగా అయిన తర్వాత తర్వాత వాటిలో మజ్జిగను పోసి, సన్నని మంటపై ఉడికించాలి. ఇలా ఉడికిస్తే తినడానికి మంచిగా ఉంటుంది. పచ్చి వాసన పోయే వరకు బాగా వేయించాలి.

**చివర్లో కొత్తిమీరను వేయండి :**

కొద్దీ సేపటి తర్వాత కొత్తగా పాన్ తీసుకుని మళ్ళీ నూనె వేసి, అర టీ స్పూన్ ఆవాలు, అర టీ స్పూన్ జీలకర్ర, కరివేపాకు ఆకులు , 5 పచ్చిమిర్చి, ఒక టేబుల్ అల్లం పేస్ట్ కూడా వేసి మజ్జిగలో ఉడికించాలి. ఆ తర్వాత చివర్లో కొద్దిగా కొత్తిమీర వేసి కిందకు దించుకోవడమే



# చేప కళ్లు తింటే..!



## ఈ సీక్రెట్స్ తెలిస్తే..



**సాధారణంగా మనం చేపలు తెచ్చుకున్నప్పుడు ముక్కల మీద చూపించే శ్రద్ధ.. చేప తల లేదా కళ్ల మీద చూపించం. చాలామంది చేప కళ్లను తీసి పారేస్తుంటారు. కానీ ఆ చిన్న చేప కళ్లలో అద్భుతమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయని మీకు తెలుసా? పోషకాహార నిపుణుల ప్రకారం.. చేప కళ్లు కేవలం రుచి కోసమే కాదు శరీరానికి అవసరమైన అత్యంత కీలకమైన సూపర్ ఫుడ్ అని తేలింది. చేప కళ్లలో విటమిన్-ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది రేచీకటిని నివారించడమే కాకుండా దృష్టి లోపాలను సరిచేస్తుంది. చిన్నప్పటి నుంచే పిల్లలకు చేప కళ్లు తినిపిస్తే, వారి కంటి చూపు మెరుగుపడటంతో పాటు భవిష్యత్తులో కంటి సమస్యలు రాకుండా ఉంటాయి.**

### మెదడు చురుగ్గా.. జ్ఞాపకశక్తి మెండుగా..



మెదడు పనితీరుకు అవసరమైన ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు చేప కళ్లలో అధికంగా ఉంటాయి. ఇవి జ్ఞాపకశక్తిని పెంచడమే కాకుండా వయసుతో పాటు వచ్చే మతిమరుపు వంటి సమస్యలను దూరం చేస్తాయి. ముఖ్యంగా నరాల సంబంధిత సమస్యలు, ఆటిజంతో బాధపడే పిల్లలకు ఇది ఒక సహజమైన ఔషధంలా పనిచేస్తుంది.

### షుగర్, బీపీలకు చెక్



శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో చేప కళ్లలోని ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. అలాగే ఇవి శరీరంలోని అనవసరపు కొవ్వును కరిగించి, బరువు తగ్గాలనుకునే వారికి సహాయపడతాయి. అలాగే ఇవి రక్త ప్రసరణను మెరుగుపరిచి అధిక రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. గుండె ఆరోగ్యానికి కూడా ఇవి ఎంతో మేలు చేస్తాయి.

### ఎముకల బలం.. నిద్రలేమికి దూరం


వీటిలో ఉండే విటమిన్-డి, కాల్షియం ఎముకలను దృఢంగా ఉంచుతాయి. అంతేకాకుండా నిద్రలేమితో



బాధపడేవారికి చేప కళ్లు ఒక వరమనే చెప్పాలి. ఇందులోని విటమిన్-డి మెలటోనిన్ అనే హార్మోన్‌ను ప్రేరేపించి, రాత్రిపూట హాయిగా నిద్ర పట్టేలా చేస్తుంది.



### క్యాన్సర్ నిరోధకంగా..



చేప కళ్లలోని యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ-ఇన్ఫ్లమేటరీ గుణాలు కణాల అసాధారణ పెరుగుదలను అరికడతాయి. తద్వారా కొన్ని రకాల క్యాన్సర్ల ముప్పును తగ్గించవచ్చని పలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

### పోషకాల పరంగా...

రుచి పరంగా కొంతమందికి చేప కళ్లు నచ్చకపోవచ్చు. కానీ పోషకాల పరంగా ఇది ఒక ఖరీదైన సంపద. కంటి చూపు, మెదడు శక్తి, ఎముకల బలం కోసం మీ తదుపరి సారి చేపలు తెచ్చుకున్నప్పుడు వాటి కళ్లను పారేయకుండా మీ ఆహారంలో భాగం చేసుకోండి.



# మిల్లెట్స్‌తో పలావ్..

## ఆరోగ్యం డబుల్, రుచి ట్రిపుల్

ఈ రెసిపీని ఎక్కువగా కొర్రలతో చేసి తింటారు. దీనిలో ఫైబర్, ప్రోటీన్లు ఎక్కువగా ఉంటాయి. దీనిలో మిల్లెట్స్, కూరగాయలు వేస్తారు. ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ కు ఇది పర్ఫెక్ట్. తక్కువ నీరుతో చేస్తే టేస్ట్ నెక్స్ట్ లెవెల్ అని చెప్పుకోవాలి.



**కావాల్సిన పదార్థాలు :**
మిల్లెట్స్, నాలుగు బిర్యానీ ఆకు, 5 లవంగం, 4 యాలకులు, ఉల్లిపాయలు ముక్కలు , కట్ చేసిన పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి , క్యారెట్, ఉప్పు, కారం, నూనెను తీసుకోవాలి.

**మిల్లెట్ పులావ్‌ను ఎలా తయారు చేయాలంటే?**

ముందుగా ఒక కప్పు మిల్లెట్స్‌ను తీసుకుని వాటిని ఒకటికి రెండు సార్లు కడిగి ఒక గంట పాటు నానబెట్టి పక్కన పెట్టుకోవాలి.

ఇక ఇప్పుడు స్టవ్ వెలిగించి కుక్కర్‌లో కొద్దిగా నూనె వేసి అది వేడయ్యాక దాచీన చెక్క, లవంగం, నాలుగు యాలకులు, మసాలాలు కూడా వేసి బాగా వేయించాలి. కొద్దీ సేపటి తర్వాత ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం-వెల్లుల్లి పేస్ట్ వేసి బాగా వేయించాలి.

ఇప్పుడు నానబెట్టిన మిల్లెట్స్ ను కుక్కర్లో వేసి రెండు గ్లాసుల నీళ్లు పోసి రుచికి సరిపడా ఉప్పు కూడా వేసి టేస్ట్ చూసి మూత పెట్టాలి మీడియం మంటపై ఉంచి 5 విజిల్స్ వచ్చే దాకా మెత్తగా ఉడికించాలి. చివర్లో కొత్తిమీర వేసి కిందకు దించేయడమే.

# ఉల్లితో జాగ్రత్త..

**వంటింట్లో ఉల్లిపాయ లేనిదే ఏ వంటా పూర్తి కాదు. అయితే ఇటీవల మార్కెట్లో దొరికే ఉల్లిపాయలపై నల్లటి మచ్చలు లేదా నల్లటి పొడి వంటి పదార్థం కనిపిస్తోంది. చాలామంది దీనిని మామూలు ధూళి అని భావించి కడిగేసి వాడుతుంటారు. కానీ ఆ నల్లటి మచ్చల వెనుక ఉన్న అసలు నిజం తెలిస్తే మీరు షాక్ అవుతారు. ఆ మచ్చలు కేవలం మురికి కాదని, అవి ఒక రకమైన ప్రమాదకరమైన ఫంగస్ అని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఉల్లిపాయలపై కనిపించే ఈ నల్లటి పొడిని శాస్త్రీయంగా ఆస్పెర్‌గిల్లస్ నిగ్రి అని పిలుస్తారు. సాధారణ భాషలో దీనిని నల్ల బూజు అంటారు. ఉల్లిపాయలు పండించేటప్పుడు లేదా నిల్వ చేసేటప్పుడు తేమ శాతం పెరిగినా, గాలి వెలుతురు సరిగ్గా లేకపోయినా ఈ శిలీంధ్రం వేగంగా వ్యాపిస్తుంది. ఇది చూడటానికి బొగ్గు పొడి చల్లినట్లుగా ఉల్లిపాయ పైపొరలపై పేరుకుపోతుంది.**



**ఆరోగ్యానికి ఎంత ప్రమాదం..?**

ఈ నల్ల బూజు వల్ల కలిగే నష్టాలు సామాన్యమైనవి కావు.. ఈ శిలీంధ్రం ఓక్రాటాక్సిన్ ఏ అనే విష పదార్థాన్ని విడుదల చేస్తుంది. ఇది ఆహారం ద్వారా శరీరంలోకి వెళ్తే కాలేయం, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. అలెర్జీలు లేదా ఆస్తమా ఉన్నవారు ఈ బూజు పట్టిన ఉల్లిపాయలను తాకినప్పుడు, ఆ బీజాంశాలు గాలిలోకి విడుదలయ్యి శ్వాసనాళాల్లోకి వెళ్లే ప్రమాదం ఉంది. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఇది ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది.

**వాడాలా? పారేయాలా? ఎలా గుర్తించాలి?**
నల్ల మచ్చలు ఉన్న ప్రతి ఉల్లిపాయను పారేయక్కర్లేదు. కానీ ఎలా వాడాలో తెలియాలి. నల్లటి పొడి కేవలం పైన కాగితం లాంటి పొరలకే ఉండి, లోపల ఉల్లిపాయ గట్టిగా ఉంటే.. ఆ పొరలను తీసేసి, ఉల్లిపాయను బాగా కడిగి వాడుకోవచ్చు. ఒకవేళ ఆ నల్లటి మచ్చలు లోపలి పొరల్లోకి వెళ్లినా, ఉల్లిపాయ మెత్తబడి జిగురుగా అనిపించినా లేదా చెడు వాసన వస్తున్నా.. దానిని వెంటనే పారేయడం ఉత్తమం.

**నిల్వ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు:**

ఉల్లిపాయలను ఎప్పుడూ చల్లని, పొడి ప్రదేశంలో ఉంచాలి.
ప్లాస్టిక్ కవర్లలో కాకుండా గాలి ఆడే జాలి సంచుల్లో లేదా బుట్టల్లో ఉంచాలి.
ముఖ్యంగా ఉల్లిపాయలను బంగాళా దుంపలతో కలిపి ఉంచకూడదు.
ఎందుకంటే బంగాళాదుంపలు విడుదల చేసే తేమ వల్ల ఉల్లిపాయలకు త్వరగా బూజు పడుతుంది.



## మళ్లీ బేర్‌మన్న మార్కెట్లు..

# రూ.9లక్షల కోట్లు ఆవిరి

నినాదం మార్కెట్

దేశీయ మార్కెట్ల రెండు రోజుల లాభాల జోరుకు బ్రేక్ పడింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగింపుపై అనిశ్చితులు, భగ్గుమన్న చమురు ధరలతో శుక్రవారం స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా పతనమవ్వగా.. నిఫ్టీ మళ్లీ 23వేల మార్క్ కిందకు దిగజారింది. బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.422లక్షల కోట్లకు తగ్గడంతో.. ఈ ఒక్క రోజే మదుపర్ల సంపద దాదాపు రూ.9లక్షల కోట్ల మేర ఆవిరైంది.



**ఆద్యంతం నష్టాల్లోనే..**
అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో నేటి ట్రేడింగ్‌ను సూచీలు నష్టాలతో ప్రారంభించాయి. 74,883 పాయింట్ల వద్ద మొదలైన సెన్సెక్స్ అంతకంతకూ దిగజారుతూనే ఉంది. ఇంట్రాడేలో 73,534.41 కనిష్ఠ స్థాయిని తాకిన సూచీ.. చివరకు 1690.23 పాయింట్ల నష్టంతో 73,583.22 వద్ద స్థిరపడింది. అటు నిఫ్టీ 486.85 పాయింట్లు పతనమై 22,819.60 వద్ద ముగిసింది.

ఎన్ఎస్ఈలో శ్రీరామ్ ఫైనాన్స్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టపోయాయి. ఓఎన్జీసీ, టీసీఎస్, విప్రో, భారతీ ఎయిర్‌టెల్, కోల్ ఇండియా స్వల్పంగా లాభపడ్డాయి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్, రియల్టీ షేర్లు 3శాతం మేర పతనమయ్యాయి.

**మార్కెట్ల పతనానికి కారణాలివే..**
పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయంగా చమురు ధరలు మళ్లీ పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ధర 107.97 డాలర్లుగా ఉంది. అటు అంతర్జాతీయ ఈక్విటీల్లో అమ్మకాలు వెల్లువెత్తాయి. రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. నేటి ట్రేడింగ్‌లో డాలర్‌తో పోలిస్తే మన రూపాయి విలువ ఏకంగా 86 పైసలు క్షీణించి 94.82 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠాన్ని తాకింది. కొంతకాలంగా వరుసగా నష్టాల్లోనే ఉన్న స్టాక్ మార్కెట్లు.. గత రెండు సెషన్లలో లాభపడ్డాయి. దీంతో నేటి ట్రేడింగ్‌లో మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం కూడా మార్కెట్ల పతనానికి ఓ కారణమైంది.

## బయోకాన్ కొత్త ఎండీ, సీఈవోగా శ్రీహాస్..




బయోకాన్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా శ్రీహాస్ ప్రదీప్ తాంబేని నియమించనున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న సిద్ధార్థ్ మిత్తల్ రాజీనామా చేయగా, దానికి బోర్డు ఆమోదం తెలిపింది. ఈ పరిణామాలతో ఔషధ తయారీ సంస్థల షేర్లు నేడు స్వలంగా నష్టాల్లో ఉన్నాయి. శ్రీహాస్ ఏప్రిల్ 1 నుంచి బయోకాన్ బాధ్యతలు స్వీకరించనున్నారు. మరోవైపు చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ముఖేష్ కామత్ కూడా తన పదవికి రాజీనామా చేశారు. ఆ స్థానంలో కేదార్ నారాయణ్ ఉపాధ్యేను కంపెనీ నియమించనుంది. ఈ నియామకాలకు సంబంధించి బయోకాన్ ఓ ప్రకటన విడుదల చేసింది. దీంతో నేటి మార్కెట్లో ఈ ఔషధ తయారీ సంస్థ షేర్లు పడిపోయాయి. ఓ దశలో దాదాపు 3శాతానికి పైగా కుంగి రూ.368.20కు చేరాయి. ప్రస్తుతం మధ్యాహ్నం సమయంలో 2 శాతం నష్టంతో ట్రేడవుతున్నాయి.

## మరో 5 లక్షలకు పైగా ఇండక్షన్ స్టవ్‌ల సరఫరా


**దిల్లీ:** రెండు విడతల్లో 5 లక్షల ఇండక్షన్ స్టవ్‌ల సరఫరా కోసం కొత్తగా టెండర్లు పిలిచే యోచనలో ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) ఉన్నట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో, వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సరఫరాపై ప్రభావం పడటంతో విదరి?యుత్తు సాయంతో వంట చేసుకునే ఉపకరణాలకు గిరాకీ పెరిగింది. గిరాకీకి తగ్గట్లుగా సరఫరా పెంచేందుకు ఇటీవలే లక్ష ఇండక్షన్ స్టవ్‌లకు టెండర్ ప్రక్రియను ఈఈఎస్ఎల్ పూర్తి చేసింది. పలు రాష్ట్రాల ప్రభుత్వాలు, వినియోగదారుల అభిప్రాయాలు సేకరించి, ఇండక్షన్ ఆధారిత వంట సామగ్రికీ టెండర్ ప్రక్రియను నిర్వహించింది. 'ప్రస్తుతం మార్కెట్లో వినియోగదార్ల నుంచి వస్తున్న అధిక స్పందనను దృష్టిలో ఉంచుకుని, దాదాపు 5 లక్షల ఇండక్షన్ స్టవ్‌లకు కొత్తగా టెండర్లు ఆహ్వానించాలని ఈఈఎస్ఎల్ భావిస్తోంద'ని అధికారిక వర్గాలు వెల్లడించాయి.



### శ్రీరామనవమి వేళ..

## పతనమైన వెండి ధర..

బంగారం, వెండి ధరలు ఎప్పుడు పెరుగుతాయో, ఎప్పుడు తగ్గుతాయో అంచనా వేయడం కష్టం. నిత్యం ట్రేడింగ్ చేసే వాళ్లు ఈ ధరల హెచ్చుతగ్గులను కచ్చితంగా అంచనా వేయ గలుగుతారు. ధరల పెరుగుదల, తగ్గుదల ఇన్వెస్టర్ల చేతిలోనే సగానికిపైగా ఉంటే.. మిగతాది డాలర్‌తో రూపాయి విలువ, అంతర్జాతీయ యుద్ధ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. శ్రీరామనవమి వేళ.. శుక్రవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్లో బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు నమోద య్యాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.160 పెరిగి.. రూ.1,44,710కి చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.150 మేర పెరిగి రూ.1,32,650కి వెళ్లింది. మరోవైపు వెండి ధర భారీగా పతనమైంది. కేజీ వెండి ధర ఏకంగా రూ.15,000 తగ్గింది. శుక్రవారం హైదరాబాద్ లో కిలో వెండి ధర రూ.2,45,000 వద్ద కొనసాగుతోంది. లైవ్ ట్రేడింగ్ ను బట్టి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి.



## విమాన సంస్థలకు త్వరలో మంచి రోజులు: డీజీసీఏ

**దిల్లీ:** విమానయాన సంస్థలు సులభంగా వ్యాపారం చేసుకునేందుకు, అవి వృద్ధి చెందేందుకు తగిన మద్దతు ఇస్తున్నామని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) పేర్కొంది. ప్రయాణికుల హక్కుల పరిరక్షణకూ తగిన చర్యలు తీసుకుంటున్నామని డీజీసీఏ అధిపతి ఫయాజ్ అహ్మద్ కిద్వాయ్ పేర్కొన్నారు. యుద్ధాల కారణంగా కొన్ని దేశాలు గగనతల ఆంక్షలు విధించడంతో, అంతర్జాతీయ మార్గాల్లో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి రావడం, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరతో పాటు కార్యకలాపాల వ్యయాలు పెరగడం వంటి సవాళ్లను విమానయాన కంపెనీలు ప్రస్తుతం ఎదుర్కొంటున్నాయన్నారు. త్వరలో మంచి రోజులు రావొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత పౌర విమానయాన మార్కెట్ వృద్ధి కోసం డీజీసీఏ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ పలు చర్యలు తీసుకుంటున్నాయి. డిసెంబరులో ఇండిగో విమాన కార్యకలాపాలకు పెద్దఎత్తున అంతరాయం ఏర్పడిన సందర్భాల్లో, ఇతర సంస్థల విమాన టికెట్ల ధరలు మరీ పెరగకుండా విధించిన గరిష్ఠ పరిమితి ఆంక్షలను ఇటీవల సంస్థ తొలగించింది కూడా.

ఎయిరిండియా అధికారిపై చర్యలు: గత వారం వాంకోవర్ (కెనడా)కు అనుమతి ఉన్న విమానం బదులు ఇంకొక విమానాన్ని పంపిన నేపథ్యంలో దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిందిగా ఎయిరిండియాకు డీజీసీఏ సూచించింది. ఇందుకు బాధ్యుడైన అధికారిపై చర్యలు తీసుకుంది. వాంకోవర్‌కు బోయింగ్ 777-300 ఈఆర్ మోడల్ విమానానికి అనుమతులుండగా, బోయింగ్ 777-200 ఎల్ఆర్ విమానాన్ని పంపింది. కెనడా అధికారులు అనుమతి నిరాకరించడంతో.. 7 గంటల ప్రయాణం తర్వాత దిల్లీకి విమానం తిరిగొచ్చిన సంగతి తెలిసిందే.



## శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్





**అమీన్పూర్, మార్చి27, (నినాదం):** మండలంలోని శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని.. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలు, దేవాలయాల్లో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కొల్లూరి చంద్రకళ గోపాల్, సీనియర్ నాయకులు దాసు యాదవ్, తుమ్మల ప్రభాకర్ రెడ్డి, ఉత్సవ కమిటీల సభ్యులు,కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు



**అల్వాల్, మార్చి 27 (నినాదం):** అల్వాల్ పట్టణంలోని పరిధిలోని టెంపుల్ అల్వాల్ లో వెలిసిన శ్రీ సీతారామ నామ సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో హరిదాసు మండపంలో శ్రీ సీతారామ వసంత నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగ కొనసాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా శ్రీరామ నవమి వేడుకలలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. భక్తులకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకుఅన్న ప్రసాదవితరణ గావించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలోకార్యవర్గ సభ్యులు కందగట్ల సుదర్శన్ రెడ్డి, పరంకుశం మాధవ్, వెంకటరామచంద్రరావు, కృష్ణమాచార్యులు, రాము, రవి, రామ్ సింగ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ కళ్యాణ వేడుకల్లో పాల్గొన్న సాంటి రెడ్డి పున్నారెడ్డి



**కుత్బుల్లాపూర్, మార్చి 27 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం మహాదేవపురం, గాజులరామారం, రోడా మేస్త్రి నగర్ డివిజన్, కైలాస్ హిల్స్ ,హెచ్ ఏ ఎల్ కాలనీ, దేవభూమి నగర్ , బేకరీ గడ్డ , ఎన్టీఆర్ నగర్ , లెనిన్ నగర్, ఉమాదేవి నగర్, సంస్కృతి ఎంక్లేవ్, ద్వారకా నగర్ ,పీఎం రెడ్డి నగర్, శివ సాయి హిల్స్ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు టీపిసిసి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ నియోజక కాంగ్రెస్ పార్టీ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ కాలనీ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్‌తో పాటు మరలింగ , పవన్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ వైభోగమే..

**చిట్కుల్‌లో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం**

**నీలం మధు ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు**

**స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాలు సమర్పణ**

**భక్త జనులకు స్వామివారి ముత్యాలు పంచిన నిర్వాహకులు**

**భక్తి గీతాలకు మహిళలతో కలిసి కోలాటం ఆడిన నీలం మధు దంపతులు**





**పటాన్చెరు, మార్చి 27 (నినాదం):** పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ జి టి ఎన్ కాలనీలో శ్రీరామనము సందర్భంగా శ్రీ సీతారామ కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది.మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ సహకారంతో కళ్యాణ వేడుకలు అత్యంత వైభవోపేతంగా కొనసాగాయి. నీలం మధు సొంత నిధులతో నిర్మించిన ఈ ఆలయంలో గత ఐదు రోజులుగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు జరిగాయి. జలధివాసం, ధాన్యాధివాసం వంటి క్రతువులతో పాటు లోక కల్యాణం కోసం నిర్వహించిన హోమాలు, యజ్ఞ యాగాదులతో చిట్కుల్ గ్రామం భక్తిపారవశ్యంలో మునిగిపోయింది. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన స్వామివారి విగ్రహాలకు మహా కుంభాభిషేకం నిర్వహించి, భక్తుల సందర్శనార్థం ఆలయాన్ని సిద్ధం చేశారు. శ్రీరామనవమి రోజున అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. నీలం మధు ముదిరాజ్ దంపతులు తమ స్వగృహం నుంచి పట్టు వస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను ఊరేగింపు గా తీసుకుని వచ్చి స్వామి వార్లకు సమర్పించి కళ్యాణ వేడుకలో పాల్గొన్నారు. సీతారాముల విగ్రహాలను చూడ ముచ్చటగా అలంకరించి ముత్యాల తలంబ్రాలతో సాగిన ఈ కల్యాణ ఘట్టం భక్తులకు కనువిందు చేసింది. ఈ మహత్తర కార్యక్రమానికి భక్తజనసంద్రం పెద్ద ఎత్తున హాజరై స్వామివారి కళ్యాణ మహోత్స వంలో భాగస్వాములు అయ్యారు. సీతారాముల కళ్యాణం సందర్భంగా ఏర్పాటుచేసిన సంగీత విభావరిలో గాయని భవాని ఆధ్వర్యంలో గాయకులు ఆలపించిన గీతాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. ఆలయ ప్రాంగణమంతా జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ప్రముఖ గాయని గాయకులు ఆలపించిన భక్తి పాటలకు మహిళలతో కలిసి నీలం మధు దంపతులు కోలాటం ఆడి ఉత్సాహం పెంచారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. గ్రామస్తులందరి సహకారంతో నూతన ఆలయ నిర్మాణం పూర్తి కావడం, సీతారాముల ప్రతిష్టాపన జరగడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందని అన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను, శాంతిని పెంపొందిస్తాయని తెలిపారు.

ఆ సీతారాముల దయతో ప్రజలందరూ సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ ఉత్సవాలకు విచ్చేసిన భక్తులందరికీ అన్న వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గీతంలో డిజిటల్ సాన్నిహిత్యంపై ఆతిథ్య ఉపన్యాసం

**విద్యా పరిశోధనను విపులీకరించిన సెంటర్ ఫర్ ఏషియన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ తేజస్విని నిరంజన**



**పటాన్చెరు, మార్చి 27/(నినాదం):** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లోని ఆంగ్లం, ఇతర భారత విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ సాన్నిహిత్యం: అంతర్–ఆసియాలో యువతులు అనే శీర్షిక శుక్రవారం ప్రత్యేక ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని గీతంలోని సెంటర్ ఫర్ ఏషియన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ తేజస్విని నిరంజన అందించారు. ఆసియా నగరాలైన హాంగ్ కాంగ్, సింగపూర్, గ్వాంగ్ జౌ, బెంగళూరులలో ఆమె ఇటీవల జరిపిన బహుళ–ప్రాంతీయ పరిశోధన ఆధారంగా, నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలు, అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల సంస్కృతులచే రూపుదిద్దుకున్న డిజిటల్ మాధ్యమం, యువతులు తమ గుర్తింపు, సంబంధాలు, ఆత్మీయతను నిర్వహించుకునే విధానాలను ఎలా మారుస్తుందో ప్రొఫెసర్ నిరంజన అన్వేషించారు. ప్రజా, వ్యక్తిగత జీవితాల మధ్య సరిహద్దుల పునర్వ్యవస్థీకరణ, డిజిటల్ మాధ్యమాల ద్వారా సామాజికత ఆవిర్భావం, రోజువారీ అనుభవంలో స్మార్ట్ ఫోన్ల పాత్ర కీలకంగా మారడం వంటి అంశాలను ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ఉపన్యాసం భాషా పద్ధతులు, ఆన్ లైన్–ఆఫ్ లైన్ సంబంధాలు, డిజిటల్ సన్నిహిత ప్రవర్తన యొక్క కొత్త రూపాలను కూడా పరిశీలించింది. సమకాలీన సందర్భాలలో భావప్రసార సరళి, ప్లాట్ ఫారమ్ వినియోగం, ఎంపిక చేసుకున్న భాషా వాడకం అనేవి భావోద్వేగ వ్యక్తీకరణను, సామాజిక సంబంధాలను ఎలా పునర్నిర్మిస్తాయో వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ హెచ్ఎస్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆంగ్లం, ఇతర భారత విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మోండల్ వందన సమర్పణతో ముగిసింది.

**వక్త గురించి:**
ప్రొఫెసర్ తేజస్విని నిరంజన గీతంలో డైరెక్టర్ గానే కాక, హాంకాంగ్ లోని లింగ్నాన్ విశ్వవిద్యాలయంలో అనుబంధ ప్రొఫెసర్. విశిష్ట పండితురాలైన ఆమె సంస్కృతి, సంగీతం, వలసానంతర అధ్యయనాలపై అనేక ప్రభావవంతమైన రచనలను చేయడమే గాక, సంపాదకత్వం వహించారు. ఆమె అమెరికన్ లిటరరీ ట్రాన్స్ లేటర్స్ అసోసియేషన్ వారిచే ఫిక్షన్ విభాగంలో జాతీయ అనువాద పురస్కారం పొందిన అవార్డు గ్రహీత, అనువాదకురాలు.

## శ్రీరామనవమి వేడుకల్లో కేఎం ప్రతాప్ ప్రత్యేకపూజలు



**కుత్బుల్లాపూర్, మార్చి 27 (నినాదం):** శ్రీ రామనవమి వేడుకల సందర్భంగా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు కాలనీలలో, బస్తీలలో సంక్షేమ సంఘం సభ్యులు, ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేఎం ప్రతాప్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కె ఎం ప్రతాప్ మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలను తెలియజేశారు. శ్రీ రాముని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, అష్టైశ్వర్యాలు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నానన్నారు.ఈ కార్యక్రమంలో పలుకాలనీల,బస్తీల సంక్షేమ సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



**అమీన్‌పూర్, మార్చి 27 (నినాదం):** మండలంలోని శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమీన్పూర్, బీరంగూడ డివిజన్ల పరిధిలోని వివిధ కాలనీలలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నందారం నరసింహా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. స్వంత నిధులతో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు చంద్రశేఖర్, గోపాల్, జ్ఞానేశ్వర్, అశోక్, శ్యామ్ మరియు ఎన్ ఎన్ జి యువసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

# మార్మోగిన శ్రీరామనామం





**వికారాబాద్, మార్చి 27(నినాదం):** శ్రీరామ నవమి సందర్భంగా శుక్రవారం జిల్లా లో శ్రీరామనమం మార్మోగింది. రామాలయాలు భక్తులతో కిటకిట లడాయి. రామభక్తులు భజనకీర్తనలతో భజన కార్యాక్రమాలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోశ్చరణ మధ్య సీతారాముల కళ్యాణం జరిపించారు. సీతారాములను ముస్తాబు చేసి పెళ్ళి పీటలపై ఆశీనులను చేసి ఘనంగా కన్నుల పండగగా కల్యాణాన్ని జరిపించారు. ప్రతి ఏటా ఈ వేడుకలను రెట్టింపు ఉత్సహంతో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల్లో తాండూర్ లో స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, తదితర నాయకులు, పరిగిలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, కొడంగల్ లో స్థానిక నాయకులు, చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆయా గ్రామాల కార్యక్రమాల్లో పాల్గొని పూజలు చేశారు. చేవెళ్ళ మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, సహచర నాయకులు నవాబుపేట పూలపల్లి లో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భం గా సీ సీ రోడ్డు పనులు ప్రారంభించారు. వికారాబాద్ లో అధికార పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితర నాయకులు పాల్గొని పూజలు చేశారు. సీతారాముల కళ్యాణాన్ని తిలకించారు. ఆయా గ్రామాల్లో చిన్నారులను రామలక్ష్మణ సీతమ్మతల్లీ వేషాధరణతో ముస్తాబు చేసి భక్తిని చాటుకున్నారు.

# అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం





**పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దంపతులు**

**భారీ సంఖ్యలో హాజరైన భక్తులు**

**పటాన్చెరు, మార్చి 27 (నినాదం):** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని పటాన్చెరు డివిజన్ పరిధిలోని ప్రఖ్యాత శ్రీ కోదండ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో భక్తుల హర్షధ్వానాల మధ్య, మంగళ వాయిద్యాల నాదంతో, పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య అభిజిత్ లగ్నంలో శుక్రవారం మధ్యాహ్నం శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం కన్నుల పండుగగా సాగింది. శుక్రవారం ఉదయం పటాన్చెరు శాసన సభ్యులు గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి దంపతులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి మేళతాళాల మధ్య తమ స్వగృహం నుండి వేడుకగా బయలుదేరి స్వామి వార్లకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో అర్చకులు సాంప్రదాయ బద్ధంగా కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని వీక్షించేందుకు తరలివచ్చారు. ఆలయం అందంగా పుష్పాలతో అలంకరించబడగా, ఆధ్యాత్మిక వాతావరణం మరింత పులకరించింది. ఎమ్మెల్యే జిఎంఆర్ సూచనలకు అనుగుణంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు పూర్తి సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పటాన్చెరు పట్టణం మొత్తాన్ని విద్యుత్ దీపాలతో, సీతారాముల చిత్రాలతో, పుష్పాల అలంకరణలతో ఆధ్యాత్మిక వైభవాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ఆ భగవంతుని ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

అనంతరం పటాన్చెరు డివిజన్ పరిధిలోని బండలగూడ, పంచముఖి హనుమాన్, శ్రీ రామ్ నగర్, శాంతినగర్ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయాలలో ఏర్పాటుచేసిన సీతారాముల కళ్యాణ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయా దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న పుప్పాల భాస్కర్





**కుత్బుల్లాపూర్, మార్చి 27 (నినాదం):** శ్రీరామనవమి పర్వదినం వేడుకల సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఉమ్మడి సూరారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర వేడుకలకు జిహెచ్ఎంసి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ముఖ్యఅతిథిగా హాజరైనారు.ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులతో కలిసి శ్రీ సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కళ్యాణ మహోత్సవాన్ని దర్శించుకుని, ప్రాంత ప్రజలతో కలిసి భక్తి భావంతో పాల్గొన్నారు. ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదం వడ్డించి సేవా కార్యక్రమంలో భాగమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరాముని ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సద్భావన, ధర్మబద్ధత పెంపొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు కోల శ్రీకాంత్, ముకుంద రావు, తాటి రవికుమార్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా ఘనంగా శ్రీరామనవమి వేడుకలు









**శ్రీరామ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు**

**కుత్బుల్లాపూర్, మార్చి 27 (నినాదం):** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అనేక ప్రాంతాలలో ఉన్న దేవాలయాలలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత ఘనంగా కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయాలన్నీ శ్రీరామ నామస్ భరణతో మారుమ్రోగాయి. అందులో భాగంగా శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణం వాడవాడలా ఘనంగా జరిగింది. నిజాంపేట పరిధిలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయం, శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయం,కొలన్ తులసి రెడ్డి కాలనీ పార్క్, బాలాజీ హిల్స్, జర్నలిస్ట్ కాలనీ, బండారి లేఅవుట్, ఈశ్వర్ విల్లాస్, కౌసల్య కాలనీ, సాయి అనురాగ్ కాలనీ, క్రాంతి నగర్, ప్రగతి నగర్ పరిధిలోని వాసవి లేఅవుట్ నందనవనం పార్క్ శివాజీ లేఅవుట్ చత్రపతి శివాజీ పార్క్ తదితరప్రాంతాల్లో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం కనుల పండుగ జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ రాజశేఖరరెడ్డి, తాటి రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. స్వామివారి కల్యాణంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నో లక్షల సంవత్సరాల తర్వాత కూడా రాజ్య పాలనకు శ్రీరామరాజ్యాన్ని కొలమానంగా తీసుకోవడం ఆయన పరిపాలనా దక్షతను తెలియజేస్తుందన్నారు. పాలనలో నేటికీ ఆయన ఆదర్శ పురుషుడిగా విలసిల్లుతున్నారన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి, వరగాని వాస్, ప్రశాంత్ రెడ్డి, ఆదిరెడ్డి, ఆలేటి శ్రీనివాసరావు, గూడూరు మురళి, రమేష్ బాబు, పవన్, నారాయణ రెడ్డి, రవీందర్ రెడ్డి, దాసరి మహేష్, సందీప్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

బాచుపల్లి పరిధిలోని కౌసల్య కాలనీ, సాయి అనురాగ్ కాలనీ, క్రాంతి నగర్, సాయి నగర్ తదితరప్రాంతాల్లో స్వామివారి కళ్యాణం కనుల పండుగ జరిగింది. ఈ కార్యక్రమానికి లికాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ కొలన్ శ్రీనివాస్ రెడ్డి గారు,శ్రీ కొలన్ రాజశేఖరరెడ్డి గారు మరియు తాటి రెడ్డి గారులి స్థానిక నాయకులతో కలిసి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు స్వామివారి కళ్యాణంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నో లక్షల సంవత్సరాల తర్వాత కూడా రాజ్య పాలనకు శ్రీరామరాజ్యాన్ని కొలమానంగా తీసుకోవడం ఆయన పరిపాలనా గొప్పతనాన్ని తెలియజేస్తుందన్నారు. పాలనలో నేటికీ ఆయన ఆదర్శ పురుషుడిగా విలసిల్లుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు,డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# వాడవాడలా సీతారాముల కళ్యాణోత్సవాలు



**అల్వాల్, మార్చి 27 (నినాదం) :** శ్రీరామ నవమి పర్వదినం పురస్కరించుకొని కాశీపురం కాలనీ శ్రీ సీతారామ కళ్యాణమహోత్సవ వేడుకలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, డిసి భోగేశ్వరులు, రాజ్ జితేంద్రనాథ్, బొబ్బిలిసురేందర్ రెడ్డి, తోట లక్ష్మీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక ప్రవాహం.. హిందూ వాహిని అభిమతం

### శ్రీ సీతారామ కళ్యాణ నేపథ్యం..అఖండ బైక్ ర్యాలీ

### జై శ్రీరామ నినాదాలతో మారుమోగిన కాలనీ పురవీధులు



**యైటింక్లయిన్ కాలనీ, మార్చి 27, (నినాదం):** ఆధ్యాత్మిక ప్రవాహం హిందూ వాహిని అభిమాతమని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం కాలనీ పురవీధుల్లో భారీగా బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీశ్రీశ్రీ విశ్వకర్మ శివాలయం ఆవరణలో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీని ప్రారంభించారు.షాపింగ్ కాంప్లెక్స్, షిర్కే బస్ స్టాండ్, తెలంగాణ చౌరస్తా మీదుగా శ్రీ హనుమాన్ దేవాలయం వరకు ర్యాలీ కొనసాగింది. శ్రీరామ నామ సంకీర్తనలు, జై శ్రీరామ్ నినాదాలతో కాలనీ పురవీధులు మారుమోగాయి. అశేష సంఖ్యలో హిందూ వాహిని, హిందూ బంధువులు కాషాయ కండువాలు ధరించి అత్యంత భక్తిశ్రద్ధలతో ర్యాలీలో పాల్గొన్నారు. హిందూ వాహిని సంయోజక్ మండ సాయి ప్రణీత్, సహ సంయోజక్ రామంచ శ్రావణ్, 16వ డివిజన్ కార్పొరేటర్ మండల రమ కిషన్ రెడ్డి, బిజెపి యైటింక్లయిన్ కాలనీ మండల శాఖ అధ్యక్షులు ఆకుల శశి కుమార్ పటేల్, బీజేపీ జిల్లా మాజీ కార్యదర్శి, సీనియర్ నాయకులు మూకిరి రాజు, లింగం నాయక్, నీలం రవి, బద్రి దేవేందర్, ఐలవేన అనిల్ కుమార్, అకోజీ శివ సాయి, శశాంక్, పెద్దిశ్రీ చరణ్ రెడ్డి, విక్కీ, జితేంద్ర, సాయికుమార్, అరుణ్ ప్రసాద్, సాయి ప్రవీణ్, గట్టు రాజు, ప్రేంసాగర్, అఖిల్, గణేష్, అభినయ్, ప్రేంకుమార్, స్వామి, రాకేష్, రిషి లతో పాటు ఛత్రపతి శివాజీ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా సీతారాముల కళ్యాణ మహోత్సవం





**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, మార్చి 27(నినాదం):** శ్రీరామనవమి సందర్భంగా జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో ఉన్న శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా వైభవంగా జరిగింది. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. హరిత హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీరాముడు ఆచరణలో చూపిన ఆదర్శ జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని తెలిపారు. పెద్దల పట్ల గౌరవం, పనిపై ఏకాగ్రత వంటి విలువలను శ్రీరాముని నుంచి నేర్చుకోవాలని సూచించారు. మహోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు



పేర్కొన్నారు. ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించగా, ఉదయం నుంచే వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. బ్రహ్మణవాడలోని కేశవనాథ ఆలయం నుంచి జనకాపూర్ లోని శ్రీ కోదండ రామాలయం వరకు ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవలక్ష్మి కుమారుడు కోవసాయినాథ్- హరిక దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు.ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ శాఖ బందోబస్తు ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రె ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగ, డీసీసీ ప్రతినిధి సుగుణక్క, కౌన్సిలర్లు వెంకన్న, భారతి, వినోద్, నాయకులు అరిగెల నాగేశ్వరరావు, ఖండ్రే విశాల్, బాలేశ్వర్ గౌడ్, గాదవేణి మల్లేష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పట్టు వస్త్రాలు, తలంబ్రాలతో భక్తి చాటిన పొన్నం

### -మాజీ కార్పొరేటర్ పొన్నం విద్యా లక్ష్మణ్ గౌడ్

### -పవిత్రతతో కళకళలాడిన సీతారాముల కళ్యాణ మహోత్సవం

### -రామగుండం 60 వ డివిజన్‌లో భక్తి వెల్లువ



**గోదావరిఖని మార్చి 27 (నినాదం):** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 వ డివిజన్‌లో ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోవడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మాజీ కార్పొరేటర్ పొన్నం విద్యా లక్ష్మణ్ గౌడ్ ప్రత్యేక సమర్పణ ఈ పవిత్ర వేడుకలో 60 వ డివిజన్ మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్నం విద్యా లక్ష్మణ్ గౌడ్ తన స్వగృహం నుంచి సీతారాముల వారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. భక్తుల సందడి కళ్యాణ మహోత్సవం దర్శనానికి భారీగా తరలి వచ్చిన ప్రజలు సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఆలయం మొత్తం హరినామ స్మరణలతో మారుమోగింది. భక్తి, శ్రద్ధ, సంప్రదాయాల సమ్మేళనం ఈ కార్యక్రమం భక్తి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచి, ప్రాంతంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని మరింత పెంపొందించింది.

## జిల్లా హెచ్ఆర్‌సిఐ ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ ఆరిఫ్ అలీ



**పెద్దపల్లి రూరల్ మార్చి 27(నినాదం):** నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ ఆరిఫ్ అలీ నియామకం అయ్యారు. ప్రస్తుతం గత రెండు సంవత్స రాల నుండి పెద్దపల్లి జిల్లా డీ.సీ. ఎం,వ్యాన్ అసోసియేషన్ అధ్యక్షులుగా కొనసాగుతు న్నాడు. జిల్లా కేంద్రంలోని డీ.సీ.ఎం,వ్యాన్ యజమానుల సమస్యల స్పందించడంతో పాటు సోషల్ భావాలు కలిగిన వ్యక్తి అని అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. మానవ హక్కుల ఉల్లంఘన పై,కార్మికుల సమస్యల పరిష్కారం కోసం బాధితుల పక్షాన న్యాయం జరిగేలా పోరాటం చేస్తాడని పట్టణవాసులు ఆశాభావం వ్యక్తం చేశారు.అయన చేసిన సేవలను గుర్తించిన ఎన్.హెచ్. ఆర్.సి ఐ పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడి గా బాధ్యతలను అప్పగించింది.ఈ సందర్భంగా మహమ్మద్ ఆరిఫ్ అలీ మాట్లాడు తూ.హక్కుల ఉల్లంఘనకు సంబంధించి బాధితులకు చట్టపరమైన న్యాయం జరిగే విధంగా వ్యవహరిస్తా అని మహమ్మద్ ఆరిఫ్ అలీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్వామి,సత్యం, అజయ్, క్రాంతి, యూసుఫ్ తదితరులు ఉన్నారు.

## రాముని గుండాలలో భక్తి ఉత్సాహం..

### మిత్ర యూత్ సేవా కార్యక్రమం ఆకట్టుకుంది!

### శ్రీరామనవమి సందర్భంగా మజ్జిగ, అరటిపళ్ళ పంపిణీ



**గోదావరిఖని మార్చి 27 (నినాదం):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాముని గుండాల పాదక్షేత్రంలో నిర్వహించిన సీతారాముల కళ్యా ణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా మిత్ర యూత్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ మరియు అరటిపళ్ళను పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం ఎస్సై సంధ్యారాణి మరియు 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజిని రవి హాజరై సేవా కార్యక్రమాన్ని అభినందించారు.ఈ సందర్భంగా ఎస్సై సంధ్యారాణి మాట్లాడుతూ, వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని భక్తులకు మజ్జిగ, పండ్లు అందించడం ఎంతో మంచిదని, ఇలాంటి సేవా కార్యక్రమాల్లో యువత ముందుండటం సమాజానికి ఆదర్శమని కొనియాడారు.అనంతరం ఠాకూర్ అయోధ్య సింగ్, ఎస్సై సంధ్యారాణి ని శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మిత్ర యూత్ సభ్యులు ఇరికిల్ల సాయికిరణ్, గుర్రం సాయి, ఇరికిల్ల తేజ, సుందిళ్ల మధు, ఇరికిల్ల ప్రణయ్, ఇరికిల్ల సందీప్, పెరుక అశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## రామాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు



**ధర్మారం మార్చి 27,( నినాదం)** శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఈ రోజు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ మండల కేంద్రంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, పుష్కారి పద్మజ జితేందర్ రావు దంపతులు, మంత్రి కి ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం సీతారామ కల్యాణంలో మంత్రి పాల్గొన్నారు. శ్రీ సీతారాముల ఆశీస్సులతో తెలంగాణ ప్రజలు, నియోజకవర్గంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నాడు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రూపుల నాయక్ మాజీ చైర్మన్ , నరసింహులు, మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బద్దం గంగారెడ్డి, ధ్యాగేటి ఉదయ్, వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## భక్తులకు ఉచిత ప్రసాదం.. శివ సాయి సంస్థ ముందడుగు

### భక్తులకు సేవే లక్ష్యం

### బెల్లం పానకం, ప్రసాదం పంపిణీ



**గోదావరిఖని మార్చి 27 (నినాదం):** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రామగుండం మున్సిపల్ పరిధిలో భక్తులకు విశేష సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు శివ సాయి మల్టీ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ముందుకొచ్చింది.ఈ సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి విచ్చేసే భక్తులకు బెల్లం పానకం, మజ్జిగతో పాటు వేడివేడి ప్రసాదం పంపిణీ చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.భక్తుల సేవే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని సేవలను స్వీకరించాలని వారు అన్నారు.సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పటికప్పుడు ముందుండే ఈ సంస్థ, ఈసారి కూడా శ్రీరామ నవమి సందర్భంగా భక్తులకు సౌకర్యాలు కల్పించడం ద్వారా మంచి పేరు తెచ్చుకుంటోందని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

### అంబటి దంపతుల ఆధ్వర్యంలో

## శ్రీరామనవమి వేడుకలు

### -సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహణ

### -అర్చన సంతోష్ రావు అంబటి దంపతుల ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు



**గోదావరిఖని మార్చి 27 (నినాదం):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీ విఘ్నేశ్వర భక్తాంజనేయ స్వామి దేవాలయంలో భక్తి వాతావరణం తారాస్థాయికి చేరుకుంది. అర్చన సంతోష్ రావు అంబటి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులతో కిటకిటలాడిన ఆలయంకళ్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. భక్తి శ్రద్ధలతో శ్రీ సీతారాముల దివ్య కళ్యాణాన్ని దర్శించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. కోలాటాలతో పల్లకి సేవ ప్రత్యేక ఆకర్షణకళ్యాణం అనంతరం మహిళలు సంప్రదాయ కోలాటాలతో కాలనీలో పల్లకి సేవను నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ దృశ్యం భక్తులను ఆకట్టుకుని పండుగకు మరింత శోభను తీసుకొచ్చింది.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు భాస్కర్ శర్మ, నిర్వాహకులు పీచర శ్రీనివాస్ రావు, నరేష్, ప్రభాకర్ రావు, సంపత్ రెడ్డి, కొండల్ రెడ్డి, రమేష్, డా. జగన్ మోహన్ రావు, డా. శ్రీను, జగన్, కృష్ణమూర్తి, పి. తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.అలాగే కార్పొరేటర్లు గడ్డం రామాదేవి శ్రీనివాస్, వేగోలపు రామాదేవి శ్రీనివాస్, వడ్లూరి రవి తదితరులు హాజరై వేడుకలను విజయవంతం చేశారు. భక్తి, సంప్రదాయం కలిసిన మహోత్సవం,శ్రీరామన వమి సందర్భంగా నిర్వహించిన ఈ కళ్యాణ మహోత్సవం భక్తి, సంప్రదాయం, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

## మహిళలు సమాజ దిశా నిర్దేశకులు

### వాక్యోపదేశకులు విజయ రాణి



**మంథని, మార్చి 27 (నినాదం):** మహిళలు సమాజ దిశా నిర్దేశకులని వాక్యోపదేశకులు విజయ రాణి అన్నారు. శుక్రవారం మంథని పట్టణంలోని సీయోను ప్రార్థన మందిరంలో జరిగిన ఇండియా మిషన్ ప్రాంతీయ స్త్రీల కూడికలో ఆమె వార్షికోపదేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కుటుంబాన్ని సంఘాన్ని సమాజాన్ని దిశా నిర్దేశం చేస్తారని పిల్లలను చిన్ననాటి నుండే ఆధ్యాత్మిక రంగంలో నడిపిస్తూ క్రమశిక్షణలో పెంచుతారని ఆమె పేర్కొన్నారు. పరిశుద్ధ గ్రంధం బైబిల్ లో మహిళలు కుటుంబాలను సంఘాలను అభివృద్ధి పరచడంలో గొప్ప పాత్ర పోషించారని ఆమె పేర్కొన్నారు. పిల్లలను ప్రతి ఆదివారం చర్చికి తీసుకెళ్లడం సండే స్కూల్ హాజరు అయ్యేటట్లు చేయడం బైబిల్ చదవడం ప్రార్థనలు చేయడం నేర్పిస్తూ చిన్ననాటి నుండే ఆధ్యాత్మికత పెంపొందించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా మహిళలకు బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సీయోను ప్రార్థన మందిరం పాస్టర్లు దూడ మహేష్, మంథని మార్క్, అజ్మీరా దయారాజు, చిప్పకుర్తి సుధాకర్, సంఘ పెద్దలు అంకరి కుమార్, మంథని ప్రసాద్, అందె రమేష్, రామగిరి కుమార్, దాసరి సదానందం, సీయోను స్త్రీల సమాజం నాయకులు హేమలత, పద్మజ, హేమలత, ఆమనీ ,షారోన్, దీనమ్మ, విజయ, సువార్త, కవితతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణం

### భక్తులతో కిటకిటలాడిన కళ్యాణ మండపాలు

### సీతారాముల కళ్యాణం తిలకించిన భక్తులు



**మంథని మార్చి27 (నినాదం):** సీతారాముల కళ్యాణం మంథని మండలంలో మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణ వేడుకలను తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కళ్యాణ వేడుకలను చూసి పునీతలయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేషంగా అభిషేకం నిత్య పూజలు అర్చనలు హారతి మంత్రపుష్పంతో ప్రారంభించారు. మంథని పట్టణంలోని గోదావరి నది తీరమున గల సీతారామల ఆలయంలో సీతారామ చంద్రుల కళ్యాణ మహోత్సవంనకు శాస్త్రోత్తంగా జరిపించారు. అలాగే పట్టణంలోని శ్రీ లక్ష్మి నారాయణ స్వామి దేవాలయం, షిరిడి సాయిబాబా దేవాలయాల్లో కళ్యాణ మహోత్సవం చూడముచ్చటగా జరిగింది. మండలంలోని శ్రీ అయ్యప్ప స్వామిఆలయంలో, కన్నాలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, మైదుపల్లి, ఉప్పట్ల, విలోచవరం, శ్రీరామ నగర్ రామాలయంలో సూరయ్య పల్లి, ఖమ్మంపల్లి, రచ్చపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీ సీతారాను చంద్రుల కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిపించారు. కళ్యాణం అనంతరం అన్ని ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీల నిర్వాహకులు తెలిపారు,ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని సీతారాముల అక్షింతలతో దీవెనలు అందుకున్నారు. అనంతరం అన్నదాన. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

## సీతారామ పట్టాభిషేకంకోసం

# ఎదురుచూస్తున్న ప్రజలు






### తెలంగాణలో రావణ పాలన అంతంకై వానర సైన్యం వలె కార్యకర్తలు ఉద్యమించాలి..

### శ్రీరామనవమి సందర్భంగా రామగుండం నియోజకవర్గంలో మజ్జిగ, చలివేంద్ర కేంద్రాలు ప్రారంభించిన వ్యాల్ల హరీష్ రెడ్డి

**గోదావరిఖని మార్చి 27 (నినాదం):** హరీష్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో శ్రీరామ నవమి ని పురస్కరించుకొని శ్రీ సీతారామ కళ్యాణం మహోత్సవానికి విచ్చేస్తున్న ప్రజలు భక్తులు మహిళలకు దాహార్తి తీర్చాలనే సంకల్పంతో రామగుండం నియోజకవర్గం లోని ప్రధాన ఆలయాల వద్ద జరిగే కళ్యాణోత్సవ వేడుకలలో ఉచిత మజ్జిగ, చలి వేంద్ర కేంద్రాలు ప్రారం భించామని బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయ కులు వ్యాల్ల హరీష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎనిమిదవ కాలనీ, గోదావరిఖని కోదండ రామాలయం, గంగానగర్ చంద్రశేఖర్ నగర్ లో అన్న ప్రసాదం తో పాటు గోదావరిఖని బస్టాండ్ సమీపంలోని ఐబి కాలనీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం కల్యాణోత్సవానికి వచ్చే ప్రజలకి ఉచిత, మజ్జిగ పంపిణీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ... సీతారామచంద్ర కళ్యాణ మహోత్సవం రామచంద్రుడి పట్టాభిషేకం భక్తులు ఆశీర్వచనం పొందేందుకు పెద్ద సంఖ్యలో వస్తారని వారి సౌకర్యార్థమే వ్యాల్ల హరీష్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఉచిత మజ్జిగ పంపిణీ చేస్తున్నామని అన్నారు. అలాగే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు ఎగవేసి, రైతులకు రైతుబంధు మోసం, మహిళలకు పింఛన్లు, నిరుద్యోగులకు టోకరా పెట్టిన రావణ పాలన అంతం కొరకు ఎదురుచూస్తున్నారని, రాబోయే తెలంగాణ ప్రభుత్వంలో రామ-చంద్ర( కేటీఆర్-కెసిఆర్) పట్టాభిషేకం కై భారత రాష్ట్ర సమితి కార్యకర్తలు ఉద్యమించాలని ప్రజల అభీష్టం మేరకు రామచంద్ర పట్టాభిషేకం నిర్వహించేలా కంకణబద్దులై ముందుకు సాగాలని హరీష్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజల కోరికలు సిద్ధించేలా రైతులు మంచి లాభసాటి వ్యవసాయం పొందేలా సీతా రామాంజనేయ స్వామి ఆశీస్సులు అందించాలని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గంగాజమున తహజీబ్ ముస్లిం లు పెద్ద ఎత్తున పాల్గొనడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమాలలో రామగుండం కార్పొరేషన్ మాజీ కో అప్షన్ మెంబర్ తస్నింబాను జాహిద్ పాషా, అక్బర్, అబ్దుల్ కదీర్, తహసీన్, మొయిన్ రాజ్ మొహమ్మద్, పొలాడి శ్రీనివాస్ రావు, బూరుగు వంశీ క్రిష్ణ, మేకల రామస్వామి, బొట్ల పోషం, కడమండ్ల శ్రీహరి, చొప్పరి శ్రీనివాస్, కొండా సురేష్, బొబ్బిలి సతీష్,కడార్ల శ్రీధర్, బండి రాజు, మహమ్మద్ షఫీ, అక్బర్, మోయిన్ పాషా, సిగిరి రాము,దాడి తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

## రాములోరి కళ్యాణంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్- శైలజ దంపతులు



**మంథని మార్చి 27 (నినాదం):** శ్రీరామనవమి సందర్భంగా మంథని మండలం రచ్చపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ లో జరిగిన శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాల్లో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్- శైలజ దంపతులు పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. మంథని మండలం రచ్చపల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీ లోని శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కళ్యాణం వేదపండితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ శైలజ దంపతులకు నిర్వాహకులు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు సంప్రదాయ పద్దతిల్లో జరిగిపిన శ్రీ సీతారాముల కళ్యాణ తంతును వారు తిలకించారు.

## రామాలయంలో భక్తులకు మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ



**గోదావరిఖని మార్చి 27 (నినాదం):** స్థానిక శ్రీ కోదండ రామాలయం ఆలయంలో భక్తులకు ఉపశమనం కలిగించేందుకు ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పెరుగుతున్న ఎండలను దృష్టిలో ఉంచుకుని ఆలయానికి విచ్చేసే భక్తులకు తాగునీరు, మజ్జిగ అందించడం ద్వారా సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, భక్తులకు త్రాగునీరు అందించడం గొప్ప సేవ అని పేర్కొన్నారు. భక్తులు కూడా ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రెడ్డి భాస్కర్, మల్లేష్, ప్రసాద్, రఘు, కిరణ్, కుమార్, రామ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం



**మంచిర్యాల, మార్చి 27 (నినాదం):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో సీతారాముల కళ్యాణం కమనీయంగా జరిగింది. కళ్యాణం తిల కించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. నస్పూర్ లోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన సీతారామ కళ్యాణం మహోత్సవంలో శ్రీరాంపూర్ ఏరియా జీఎం శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు

# అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం

## భక్తుల సందడి మధ్య కోలాటాలు, పల్లకి సేవతో మారుమోగిన ఐబీ కాలనీ





**గోదావరిఖని,మార్చి27(నినాదం):** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఐబీ కాలనీ లోని విఘ్నేశ్వర భక్తాంజనేయ స్వామి దేవాలయంలో అర్చన-సంతోష్ రావు అంబటి దంపతుల ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై భక్తి శ్రద్ధలతో సీతారాముల కళ్యాణాన్ని వీక్షించారు. ఇందులో భాగంగా మహిళలు కోలాటాలతో కాలనీలో పల్లకి సేవను నిర్వ హించగా, ప్రాంతం మొత్తం భక్తి వాతావ రణంతో మార్మోగింది. అనంతరం నిర్వహిం చిన అన్నదానం కార్యక్రంలో పెద్ద ఎత్తున భక్తు లు భోజనం చేసారు. ఈ కార్యక్రమంలో ఆల య ప్రధాన అర్చకుడు భాస్కర్ శర్మ, నిర్వాహ కులు పీచర శ్రీనివాస్ రావు, నరేష్, ప్రభాకర్ రావు, సంపత్ రెడ్డి, కొండల్ రెడ్డి, రమేష్, జగన్ మోహన్ రావు, శ్రీను, జగన్, కృష్ణ మూర్తి, పి.తిరుపతి రెడ్డి, కార్పొరేటర్లు గడ్డం రామాదేవి- శ్రీనివాస్, వేగోలపు రామా దేవి- శ్రీనివాస్, వడ్లూరి రవి పాల్గొన్నారు.



# గోదావరి పుష్కరాల నాటికి ఆలయ తొలిదశ అభివృద్ధి పనులు పూర్తి

### రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ

### అంగరంగ వైభవంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం



**భద్రాచలం, మార్చి 27(నినాదం) :** గోదావరి పుష్కరాల నాటికి ఆలయ తొలి దశ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ తెలిపారు. శుక్రవారం భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అనంతరం మంత్రివర్యులు కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ.. భద్రాచలం లోని శ్రీ సీతారాముల వారి కళ్యాణానికి ప్రాముఖ్యత ఉందని, దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు శ్రీ సీత రామచంద్ర స్వామి కళ్యాణాన్ని వీక్షిస్తారని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడవ సంవత్సరం మంత్రిగా తాను ఈ కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డిప్యూటీ సీఎం, స్థానిక మంత్రి వర్యుల సహకారంతో స్థానికంగా అవసరమైన భూ సేకరణ చేసిన తర్వాత, రాబోయే సంవత్సరం గోదావరి పుష్కరాలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి విడత క్రింద భద్రాచలం ఆలయానికి 351 కోట్ల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. గోదావరి పుష్కరాల సమయానికి ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు దేవాదాయ శాఖ కృషి చేస్తుందని అన్నారు. తర్వాత రెండవ విడత నిధులు విడుదల చేసుకొని కృష్ణ పుష్కరాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. నేడు కళ్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులందరికీ శ్రీ రామచంద్ర స్వామి ఆశీస్సులు ఉండాలని, ప్రజా ప్రభుత్వానికి శ్రీరామచంద్రమూర్తి శక్తిని కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆశీర్వదించాలని మంత్రి కోరారు. ఈ ప్రెస్ మీట్ లో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు, తదితరులు హాజరయ్యారు.

# బాటసారుల దాహార్తిని తీర్చడమే లక్ష్యం

### బూడిద శ్రీకాంత్ జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు

### సామాజిక సేవకుడు బూడిద వెంకటేష్




**జవహర్ నగర్, మార్చి 27 (నినాదం):** బాటసారుల దాహార్తిని తీర్చాడమే లక్ష్యమని సామాజిక సేవకుడు బూడిద వెంకటేష్ తెలిపారు. ఎండలు మండుతున్న వేళ బాటసారుల దాహార్తిని తీర్చేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ జవహర్ నగర్ పరిధిలోని 28వ డివిజన్, చంద్రాపూరి డివిజన్ మదర్ తెరిసా వికలాంగుల కాలనీలో శ్రీరామనవ మి ప్రత్యేక పర్వదినాన్ని పురస్కరించుకొని చలివేంద్రాన్ని కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్ ఏర్పాటు చేశారు. దివంగత బూడిద శ్రీకాంత్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని మాజీ కార్పొరేటర్ నిహారిక వెంకట్ గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, విశ్వకర్మ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు బాష పెల్లి రమేష్ చారి, రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నిహారిక వెంకట్ గౌడ్ మాట్లాడుతూ, సమాజ సేవలో శ్రీకాంత్ గుర్తుగా ప్రజలకు ఉపయోగపడే ఇలాంటి సేవా కార్యక్రమాలు శ్రీకాంత్, తండ్రి అయిన బూడిద వెంకటేష్ చేపట్టడం అభినందనీయమని అన్నారు. వేసవి కాలంలో మంచినీటి అవసరం ఎంతో ఉంటుందని, ముఖ్యంగా కార్మికులు, ప్రయాణికులు ఈ చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ మాట్లాడుతూ, పేదల కోసం ఇలాంటి స్వచ్ఛంద కార్యక్రమాలకు ఎప్పుడూ తమ మద్దతు ఉంటుందని తెలిపారు. కాలనీ అభివృద్ధికి, ప్రజా సేవకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ, బూడిద శ్రీకాంత్ జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మంచినీరుతో పాటు వారానికి ఒకసారి మజ్జిగ అందజేయడం ప్రతి సంవత్సరం ఈ చలి వేంద్రం ఏర్పాటు చేయడం పట్ల వర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షులు చెన్నాపురం యాదయ్య, మహేందర్ యాదవ్, మాట్లా వినయ్,భాస్కర్ గౌడ్, కిషోర్, దివాకర్, ఎం మంజుల,రవి,కే శ్రీను, కే వెంకటేష్, కిరణ్,భరత్ మీనాక్షి, కే వెంకటేష్, బాలమురళి, బి శ్రీను,బి బాబు, సంతోష్ గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే



**మునుగోడు, మార్చి 27 (నినాదం):** మునుగోడు పట్టణంలో శ్రీశ్రీశ్రీ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని 15 అడుగుల ఎత్తైన అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు మును గోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అనంతరం హనుమాన్ ఆలయ ప్రాంగణంలో జరిగిన శ్రీరామనవమి వేడుకల్లో తన సతీమణి కోమటిరెడ్డి లక్ష్మీ తో కలిసి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు పుణ్య దంపతులు.తదుపరి మునుగోడు పట్టణంలోని పురాతన శివరామ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్, గ్రామ ప్రజలు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, మర్చి 27(నినాదం) :** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నేరేడ్ మెట్ డివిజన్ ఆర్ కె పురం లోని శక్తి నగర్ లో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి భక్తి శ్రద్ధలతో, భక్తులతో కలిసి ఆనందభరిత వాతావరణంలో శ్రీ సీతారాముల దివ్య కళ్యాణాన్ని దర్శించుకున్నారు. అనంతరం భక్తులతో మాట్లాడుతూ శ్రీ సీతారాముల దివ్య ఆశీస్సులు సమస్త భక్తులు, ప్రజల పై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జికె హనుమంతరావు, జేఏసీ వెంకన్న, రేగటి శివ కుమార్ గౌడ్, జెకె సాయి గౌడ్, రాజేష్ గౌడ్, నవీన్, స్థానిక భక్తులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



N NADAM CINEMA

# పెద్ది టీజర్ విడుదల చేసిన చిత్రబృందం




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'పెద్ది అంటే బంతితో బ్యాటుకు ఎదురెళ్లే ఆట కాదురా.. పాణంతో సావుకు ఎదురెళ్లే ఆట' అనే డైలాగు.. 'ఆటే నా పొగరు' అని హీరో చెప్పడం ఆకట్టుకుంటోంది . చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తోన్న ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు 'పెద్ది' టీమ్ స్పెషల్ ట్రీట్ అందించింది. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ భారీ రూరల్ స్పోర్ట్స్ డ్రామా నుంచి మార్చి 27న సరికొత్త టీజర్ విడుదలై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన మొదటి టీజర్‌లో చరణ్ క్రికెట్ ప్లేయర్‌గా కనిపించి ఆకట్టుకోగా, తాజా టీజర్‌లో మాత్రం పూర్తిగా భిన్నమైన మాస్ అవతార్‌లో దర్శనమిచ్చాడు. కుస్తీ పోటీలలో పాల్గొనే శక్తివంతమైన యోధుడిగా ఆయన కనిపించిన తీరు అభిమానులను ఉర్రూతలూగిస్తోంది. భారీ దేహదారుఢ్యం, కఠినమైన చూపులు, రఫ్ లుక్ అన్నీ చరణ్ పాత్రను మరింత పవర్‌ఫుల్‌గా చూపిస్తున్నాయి. ఈ టీజర్ ద్వారా సినిమా నేపథ్యం, కథా గురించి కొంత క్లారిటీ వచ్చింది. ఉత్తరాంధ్ర గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో స్థానిక క్రీడలు, ముఖ్యంగా కుస్తీ పోటీలు కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. చరణ్ ఫిజిక్, బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. గ్రామీణ నేపథ్యంతో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో ఆమె పాత్ర కూడా ఆసక్తికరంగా ఉండబోతుందని సమాచారం. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం, 'పెద్ది' సినిమా భారీ స్థాయిలో రూపొందుతోంది. కథ, టేకింగ్, మ్యూజిక్, యాక్షన్ అన్ని విభాగాల్లో ఈ చిత్రం కొత్త ప్రమాణాలు సృష్టించే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇప్పటికే టీజర్‌తోనే భారీ బజ్ క్రియేట్ చేసిన 'పెద్ది', విడుదల తర్వాత బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాల్సి ఉంది.



# ఇప్పట్లో పెళ్లి ఆలోచన లేదు

### నిర్మొహమాటంగా చెప్పి సాయిపల్లవి

దక్షిణాది సినీ పరిశ్రమలో సహజ నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సాయి పల్లవి మరోసారి వార్తల్లో నిలిచారు. డ్యాన్స్ షోల నుంచి సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టి, తన టాలెంట్‌తో టాప్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె ప్రయాణం నిజంగా స్ఫూర్తిదాయకం. చిన్నప్పటి నుంచే నాట్యం, నటనపై ఆసక్తి ఉన్నప్పటికీ చదువును ప్రాధాన్యంగా తీసుకుని మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన సాయి పల్లవి, ప్రేమమ్ సినిమాలో 'మలర్ టీచర్' పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ తర్వాత ఫిదా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరై, తన సహజ నటన, తెలంగాణ యాసతో కుర్రకారును మెస్మరైజ్ చేసింది. దీంతో ఆమెకు 'లేడీ పవర్ స్టార్' అనే ట్యాగ్ కూడా వచ్చింది. ప్రస్తుతం ఆమె కెరీర్ పీక్‌లో ఉంది. బాలీవుడ్‌లో జునైద్ ఖాన్ తో కలిసి ఓ సినిమాతో ఎంట్రీ ఇస్తుండగా, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ రామాయణం లో సీత పాత్ర పోషించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే తమిళంలో ధనుష్ సరసన కూడా ఓ భారీ చిత్రంలో నటిస్తూ బిజీగా ఉంది. ఇదిలా ఉంటే, ఇటీవల ఆమె పెళ్లిపై వస్తున్న రూమర్లకు తానే స్వయంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. ఒక కార్యక్రమంలో మీడియా అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ సాయి పల్లవి స్పష్టంగా తన అభిప్రాయం వెల్లడించింది. 'ప్రస్తుతం నా పూర్తి దృష్టి కెరీర్‌పైనే ఉంది. పెళ్లి గురించి ఇప్పట్లో ఆలోచన లేదు. నేను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నాను అని చెప్పి అందరికీ క్లారిటీ ఇచ్చింది. ఆమె పెళ్లి విషయంపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతు న్నాయి. మరికొందరు మాత్రం ఆమె పెళ్లి వార్త కోసం ఎదురుచూస్తున్నారు.

## రామ్‌చరణ్‌కు పవన్ బర్త్‌డే విషెష్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేనాని, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చరణ్ వ్యక్తిత్వం, కృషి, విలువలను ప్రశంసిస్తూ పవన్ రాసిన సందేశం అభిమానులను ఎంతో ఆకట్టుకుంది. నటన పట్ల అంకితభావంతో ప్రతి సినిమాను ఎంతో కష్టపడి పూర్తి చేసే చరణ్ నిబద్ధతను పవన్ ప్రత్యేకంగా కొనియాడారు. వృత్తి పరంగానే కాకుండా, వ్యక్తిగత జీవితంలోనూ చరణ్ ఉన్నతమైన విలువలను పాటిస్తాడని ఆయన పేర్కొన్నారు. కుటుంబ బంధాలకు ఇచ్చే ప్రాధాన్యత, పెద్దల పట్ల గౌరవం, తోటి నటులు సాంకేతిక నిపుణుల పట్ల చూపించే మర్యాద చరణ్‌ను ప్రత్యేక వ్యక్తిగా నిలబెడతాయని పవన్ అభిప్రాయపడ్డారు.ముఖ్యంగా చరణ్‌లోని ఆధ్యాత్మికత, దైవభక్తి ఆయనకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చరణ్ మరెన్నో విజయాలు సాధించాలని, ఆయుష్షు, ఆరోగ్యం, ఆనందంతో జీవితాన్ని కొనసాగించాలని దేవుడిని ప్రార్థిస్తూ పవన్ కళ్యాణ్ తన శుభాకాంక్షలను ముగించారు.

# రామ్‌చరణ్.. నీ వ్యక్తిత్వమే శ్రీరామరక్ష

## తనయుడికి చిరంజీవి విషెష్



రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో సందడి నెలకొంది. 'పెద్ది' గ్లింప్స్‌తో అభిమానుల్లో జోష్ పెంచారు. కుమారుడికి శుభాకాంక్షలు చెబుతూ చిరంజీవి అరుదైన ఫొటోలను పంచుకున్నారు. 'చరణ్ బాబు.. చిన్నప్పుడు నా వేలు పట్టుకొని నడిచిన స్థాయి నుంచి.. ఈరోజు ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచే స్థాయికి ఎదగడం చూస్తుంటే నాకు చాలా గర్వంగా ఉంది. సినిమా, వ్యక్తిగత జీవితాన్ని నువ్వు బ్యాలెన్స్ చేసే విధానం, కుటుంబంపై నీకున్న బాధ్యత, దేవుడిపై భక్తి, క్రమశిక్షణ, నీ విలువలు.. వీటిని చూసిన ప్రతిసారీ నీపై నా ప్రేమ, గౌరవం మరింత పెరుగుతూనే ఉన్నాయి. ఆ దేవుడి ఆశీస్సులు, అభిమానుల ప్రేమాభిమానాలు నిన్ను ఉన్నత శిఖరాలకు నడిపించాలని కోరుకుంటున్నాను' అని చిరంజీవి తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు మై స్వీటెస్ట్ కజిన్. ఈ ఇయర్ 'పెద్ది' మూవీ పెద్ద సక్సెస్ ఇవ్వాలని కోరుకుంటున్నా అంటూ అల్లు అర్జున్ తెలిపారు. 'హ్యాపీ బర్త్‌డే అన్నయ్య! నువ్వు చిన్నప్పుడు ఎంత అల్లరి చేసేవాడివో నాకు ఇప్పటికీ గుర్తుంది. కానీ ఇప్పుడు నిన్ను చూస్తుంటే చాలా గర్వంగా ఉంది. ఇంతటి విజయాన్ని అందుకున్నా కూడా నువ్వు ఎంతో వినయంగా ఉంటావు. నీలో ఆ లక్షణం నాకు ఎంతో ఇష్టం. జీవితాన్ని నువ్వు డీల్ చేసే విధానం నన్ను ఎప్పుడూ ఆశ్చర్యపరుస్తుంది. అనవసరమైన హడావుడి, డ్రామాలు లేకుండా సైలెంట్‌గా ఉంటూనే నీలోని ప్రేమను, బలాన్ని చూపిస్తావు. నువ్వే నా ధైర్యం. ఐ లవ్ యూ అని వరుణ్ తేజ్ పోస్ట్ పెట్టాడు. 'హ్యాపీ బర్త్‌డే రామ్ చరణ్. పెద్ది గ్లింప్స్ అదిరిపోయింది. ఈ సినిమాతో నువ్వు మరో బ్లాక్‌బస్టర్ అందుకోవాలని కోరుకుంటున్నా అని నారా రోహిత్ విషెష్ చెప్పాడు.

## భక్తి, భావోద్వేగాల మేళవింపుగా ఇరుముడి




భక్తి, బంధాలు, భావోద్వేగాలతోపాటు... రవితేజ శైలి మాస్ అంశాల మేళవింపుతోనూ రూపొందుతున్న చిత్రమే 'ఇరుముడి'. శివ నిర్వాణ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియ భవానీ శంకర్ కథానాయిక. బేబి నక్షత్ర, సాయికుమార్ ముఖ్య పాత్రల్ని పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే యాభై శాతం చిత్రీకరణని పూర్తి చేసుకుందీ చిత్రం. ప్రస్తుతం హైదరాబాద్‌లో యాక్షన్ సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. స్టంట్ కొరియోగ్రాఫర్లు అనల్ అరసు, రియల్ సతీశ్ నేతృత్వంలో విభిన్నమైన పోరాట ఘట్టాల్ని తెరకెక్కిస్తున్నారు. శ్రీరామనవమిని పురస్కరించుకుని చిత్రబృందం ఓ ప్రత్యేకమైన పోస్టర్‌ని విడుదల చేసింది. తండ్రీకూతుళ్లుగా నటిస్తున్న రవితేజ, బేబి నక్షత్ర ఆ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. అద్భుతమైన కథ, కాన్సెప్ట్‌తో కూడిన చిత్రమిది. అయ్యప్ప మాల నేపథ్యం, అందమైన కుటుంబం, భావోద్వేగాల తోపాటు యాక్షన్ కూడా ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. తండ్రీ కూతుళ్ల బంధం ఈ సినిమాకి కీలకం. రవితేజ ఇప్పటివరకూ పోషించిన ప్రాతలతో పోలిస్తే ఇందులో మరింత ప్రత్యేకమైన పాత్రలో కనిపిస్తార'ని సినీ వర్గాలు చెప్పాయి. అజయ్ ఘోష్, రమేశ్ ఇందిర, శ్వాసిక, మీసాల లక్ష్మణ్, రాజ్‌కుమార్ సరిరెడ్డి, రమణ భార్గవ్, కిశోర్ కంచరపాలెం, కార్తీక్ అడుసుమిల్లి, మహేశ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, ఛాయాగ్రహణం: విష్ణు శర్మ, ప్రొడక్షన్ డిజైన్: సాహి సురేశ్, కూర్పు: ప్రవీణ్ పూడి.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787